చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

అక్టోబర్ 2018 Rs. 20

పత్రిక 8వ జన్మ దినోత్సవ
సందర్భంగా పాఠకులకు,
రచయిత(త్రు)లకు,
ప్రకటన కర్తలకు
శుభాకాంక్షలు

మెడిసిన్ నోబెల్ 2018 గ్రహీతలు

వ్యవస్థాపక సంపాదకురాలు:

తీగవరపు శాంతి

చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -8 అక్టోబర్ 2018 సంచిక -1

ఈ సంచికలో

ధారావాహికములు:

మానసరోవర యాత్ర	6
ముల్లా నస్రుద్దీన్ కథలు	13
కాశీ ఖండం	20
సంభాషణ సంస్కృతం	25
మా ఊరి నందుల కథ	31
విద్యాఘాతము	33
ప్రహేళిక	41
రాశి ఫలాలు	48

ప్రత్యేక ఆకర్షణలు

సంపాదకీయం	4
కృతజ్ఞతాభివందనములు	5
భవిష్యత్తులో భారతదేశానికి........	9
జన్మదిన శుభాకాంక్షలు	14
అరవై దాటాక జీవితవిధానంలో...	16
మా బొమ్మల పెళ్లి	19
కలం యోధుడు కాళోజీ	22
ఛందస్సులో గణితం	28
మహిళలలో చైతన్యం	32
అగ్ని	38
శక్తిప్రియం - ఆశ్వీయుజం	42

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

మన దేశ సంస్కృతి పయన మెటు?

పూర్వం మన దేశంలో ఉమ్మడి కుటుంబాల్లో చాలా హాయిగా ఉండే వాళ్ళం అని, కుటుంబంలో అందరం కలిసి మెలిసి సంతోషంగా గడిపేవాళ్ళం అని, పెద్ద వాళ్లంటే పిల్లలు ఎంతో గౌరవంగా ఉండేవారని, వారి మాటకు ఎదురు చెప్పేవారుకాదు అని చెప్పుకునే రోజులు వచ్చాయి. కొద్ది రోజులు పోతే పుస్తకాలు ఉంటే పుస్తకాలలో, లేదా ఇంటర్నెట్ లో చదువుకునే రోజులు వచ్చేటట్లు ఉన్నాయి. అలా చదువుకున్నా ఫరవాలేదు, పెద్ద వాళ్లకు దూరంగా ఉంటూ మాకు స్వేఛ్ఛ కావాలి అన్నా ఫరవాలేదు, కనీసం పెద్దవాళ్లకు గౌరవం ఇవ్వడం అటుంచి, తల్లి తండ్రులు కూడా గౌరవం నోచుకోని పరిస్థితి ఏర్పడుతోంది. అది అక్కడితో ఆగుతుందా? ఎటు దారితీస్తోంది? ఆ ప్రభావం సమాజంపై, దేశంపై అతి భయంకరమైన గాలిలా వీస్తోంది. ఏమిటి ఈ మార్పు? తప్పెక్కడ? ఎవరి వల్ల ఈ మార్పు వస్తోంది అని చర్చించుకుని, జాగ్రత్త పడక పోతే కుటుంబాలు మానసికంగా నలిగిపోయే పరిస్థితి వచ్చేస్తోంది. కాదు వచ్చేసింది అనే చెప్పాలి. తల్లి తండ్రుల పెంపకం లోపమా? లేదా ఇద్దరూ ఉద్యోగాలు చెయ్యడం వల్ల సమయం లేక పిల్లల మీద శ్రద్ధ చూపక పోవడమా? లేదా వారికి ఉన్న సమయం కాస్తా వారి సంతోషానికే కేటాయించుకోవడమా ? డబ్బులు ఖర్చుపెట్టి మంచి మంచి స్కూల్స్ లో వేసి తల్లితండ్రులు సంపాదించే లక్షలతో వారికి కావలసినవన్నీ కొనిచ్చి, వారిని సంతోషపెట్టి, వాళ్ళ స్టేటస్ సింబల్ ని ప్రపంచానికి చాటుకోవడమా? ఇవన్నీ చూసినవారు ఆ తల్లితండ్రులను గొప్పగా పొగిడితే సరిపోతుందా? ఇదేనా మానవ జన్మ నెత్తినందుకు, మనం పిల్లలని కన్నందుకు, మన బాధ్యత? ఈ ప్రశ్న పిల్లలను కన్న తల్లితండ్రులు అంతా వేసుకోవలసిందే. చేతులు కాలాక ఆకులు పట్టుకునే చందంలా పిల్లలకు చిన్నప్పటినుండీ వారికి అడిగినవి, అడగనివి, కావలసినవి, అక్కరలేనివి బజార్లో డబ్బులు కుమ్మరించి, బయట ప్రపంచానికి గొప్పలు చూపించుకుంటూ, డబ్బులు ఉన్నా లేకపోయినా రకరకాల ఫ్యాషన్ లు అలవాటు చేసి, ఇంట్లో కూడా భార్యా భర్తలిద్దరూ అరుచుకుంటూ, కుటుంబము ఒక పద్ధతిగా లేకుండా పిల్లలను పెంచి, పిల్లలకు యుక్త వయస్సు వచ్చాక వారిని సమాజంలో, దేశంలో వదులుతుంటే, వారి జీవితాలే కాక, వారి భాగస్వామి జీవితాలతో పాటు అందరి జీవితాలను పాడుచేసిన వారు అవుతున్నారు. మనకి ఆదర్శ ప్రాయమైన విదేశాలలో ముఖ్యంగా అమెరికాలాంటి దేశాలలో వారు జీవిస్తున్న స్వేచ్చాయుతమైన జీవితం మనకి ఆదర్శం. ఇక సినిమాలలో, సీరియల్స్ లో వారు కొన్ని చోట్ల చూపించే మంచివి పక్కకు తోసి, వారు తీసే కామ, క్రోధ, మోహ, హింసాయుతమైన చర్యలను మాత్రమే మనకి కావలసినవాటివిగా తీసుకుని అనుకరించడం సమాజంలో పిల్లలంతా అలవాటు చేసుకుంటున్నారు. పదిమందికీ వారి ఇండిపెండెన్సీ చూపించుకుని, స్టేటస్ గా భావిస్తున్నారు ముఖ్యంగా పిల్లలు. అక్కడే పిల్లలు పక్కదారి పట్టడం జరుగుతోంది. దీనికి మార్గం లేదా? అంటే మనం అనుసరించాలి కానీ ప్రతీ పనికి సొల్యూషన్ ఉంటుంది. ముందుగా మనం మన ఇంటిని దేవాలయం అంత పవిత్రంగా భావించి చూసుకోవాలి. తల్లితండ్రులు వారి తల్లి తండ్రులకు, అత్త మామలకు గౌరవం ఇవ్వడం అనే పద్ధతి ఇంట్లో ఉండేటట్లు చేసుకోవాలి. మనకి అప్పుడే పిల్లలు గౌరవం, మన మాటకి విలువ ఇస్తారు. మన పిల్లలను అన్ని విషయాలలోనూ వారి ప్రవర్తనా, మాటతీరూ గమనిస్తూనే ఉండాలి. పిల్లలు కూడా మనల్ని బాగా గమనిస్తూ, అనుకరిస్తూ ఉంటారు అన్న విషయం మరచిపోకూడదు. మన పిల్లలు మనకి ఎప్పుడూ గొప్పగానే కనిపిస్తారు. ఎప్పటికప్పుడు స్కూల్స్ లోను, కాలేజీల్లోనూ, అవసరమైతే స్నేహితులతోను పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో తెలుసుకుంటూ ఉండాలి. పిల్లలను చదువూ, మార్కులకే కాదు మన సంస్కృతి, సాంప్రదాయాలకు విలువనిచ్చి, మన విలువలు నేర్పుతూ పెంచాలి. ఎప్పటికప్పుడు సరి చెయ్యాలి. ఈ పద్ధతి చిన్నప్పటి నుండీ అలవాటు అయితే, పెద్ద అయ్యాక మనకే సలహాలు ఇచ్చేటట్లు తయారవుతారు. సమాజంలో మంచి చెడులు కూడా గమనిస్తూ, ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ, సర్ది చెబుతూ ఉండాలి. డిసిప్లైన్ తో ఉన్న స్నేహితుల సలహాలు తీసుకుంటూ ఎంతో జాగ్రత్తగా పెంచాలి. తమకున్న సమయాన్ని తల్లి తండ్రులిద్దరూ వారికోసం వెచ్చించాలి. ఒక్క తల్లిదే బాధ్యత అని చాలామంది వదిలేస్తూ, తండ్రి తన సరదాలు తీర్చుకుంటూ ఉంటాడు. అది చాలా తప్పు. తల్లితండ్రులిద్దరూ చక్కటి పద్ధతిలో సంసారాన్ని సాగిస్తూ పిల్లలను జాగ్రత్తగా పెంచితే, వారికి సాటెవరు? అంతేకానీ ఇప్పటి పిల్లలు కలికాలం పిల్లలు అనుకుంటూ వారి మీద శ్రద్ధ పెట్టడం మానేసి, అల్లాగే వదిలేస్తే, తల్లి తండ్రులను ఎదిరించడమే కాదు వారి జీవితాలను సర్వ నాశనం చేసుకుని, వారికి వారే కాక, తల్లితండ్రులకు, ఎవరికీ కూడా మనఃశాంతి లేకుండా చేస్తారు. ప్రస్తుత సమాజంలో పిల్లల పెంపకం గురించి తల్లితండ్రులు చాలా భయ పడుతున్నారు. వారు పిల్లల ముందు డబ్బులు, గొప్పలు, స్టేటస్ లు అంటూ చెప్పి పెంచక, పిల్లలకు కష్టపడి చదువుకుని అన్నీ నేర్చుకున్న మహానుభావుల గురించి వారికి బోధిస్తూ, గొప్ప తత్వాన్ని అలవాటు చేస్తే వారంతా భావి భారత పౌరులు కారా ?

మన సత్ సంకల్పమే మనకు బలం. మన సరి అయిన పెంపకమే మన పిల్లలకు బలం.

తీగవరపు శాంతి

కృతజ్ఞతాభి వందనములు

ప్రముఖ రచయితలకు, రచయిత్రులకు పేరు పేరునా కృతజ్ఞతలు.

శశీ పోచిన పెద్ది మురళీకృష్ణ,
శ్రీ భువన చంద్ర,
శ్రీ రమణ రావు (ఎలెక్ట్రాన్),
శ్రీ వేమూరి వెంకటేశ్వర రావు
శ్రీ కవన శర్మ ,
శ్రీ పోడూరి శ్రీనివాస రావు,
శ్రీ వేదుల సుబ్రహ్మణ్యం ,
శ్రీ పాలెపు బుచ్చిరాజు,
శ్రీమతి వసుంధర,
శ్రీ డా. శనగవరపు కృష్ణమూర్తి శాస్త్రి,
శ్రీ కొత్త రామానందం,
శ్రీ జనార్దన్ ఠాకూర్,
శ్రీ చాగంటి శరత్ బాబు,
శ్రీమతి ఆదూరి హైమావతి,
శ్రీ నందుల ప్రభాకర శాస్త్రి ,
శ్రీమతి పమ్మి భారతీ దేవి ,
శ్రీ చిలకమర్తి దుర్గా ప్రసాద రావు,
తుమ్మూరి రామ మోహన్ రావు,
శ్రీ తోటకూర ప్రసాద్,
శ్రీ జి కె అనంత సురేష్
వీరికందరికీ మనసా వాచా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను .
మీరు చేసే సమాజ సేవ ఎంతో అమూల్యం.
మీరు వ్రాసే ప్రతి అక్షరము పాఠకుల మనసులలో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆశిస్తున్నాను.
చైతన్యం సంకల్పబలం పత్రిక పాఠకుల మన్ననలను, అభిమానాన్ని చూరగొని, దినదిన ప్రవర్ధమానం కావాలని కోరుకుంటూ ....

మీ శాంతి.

కల నిజమాయె --- మానస సరోవర యాత్ర

ఆ కలలోనే భగవంతుడు మా "మానస సరోవరయాత్ర" కి పునాది వేసాడు అని చెప్పక తప్పదు. కలలో కాబట్టి అంత సులువుగా వెళ్లాను కానీ కష్టాలతో కూడిన యాత్ర అని తర్వాతే తెలిసింది! ఆ కలే కాకుండా ఇంకో పునాది కూడా ఉందండోయ్. అది కూడా చెప్తాను.

2017 డిసెంబర్ లో అమెరికా నుండి హైదరాబాదు వచ్చిన తరువాత నేను శిరిడీ వెళ్ళి, అక్కడ వారం రోజులు ఉండి, బాబా మందిరంలో సప్తాహం చేయాలనుకున్నాను. అక్కడ వారం రోజులు ఉండడానికి ముందుగా మా వారు ఒప్పుకోలేదు. నేను, నాలాగే షిర్డీలో సప్తాహం చేద్దామనుకున్న మా ఫ్రెండ్స్ తో కలిసి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను. నాకు మళ్ళీ సరి అయిన కంపెనీ దొరకరు. అందుకని నేను పట్టు వదల లేదు, ఇక తప్పదని మా వారు వచ్చారు. జనవరిలో షిర్డీ వెళ్ళాము. కానీ అక్కడకు వెళ్ళాక మావారు కూడా బాబా పారాయణ చేసి, మళ్ళీ కావాలంటే మనం ఇంకోసారి కూడా రావచ్చు అన్నారు. అక్కడ ఉన్నప్పుడే మా కాశీ ప్రోగ్రామ్ డిసైడ్ అయ్యింది. కాశీలో నేను 9 రోజులు ఉండాలి అనుకున్నాను అని మావారితో అన్నాను. అయితే కాశీ వెంటనే వెళ్లివచ్చేద్దాం అని, మావారు వెంటనే టికెట్స్ బుక్ చేశారు. ఇదంతా బాబా ఆశీస్సులు అనుకుంటాను.

తరువాత మేం ఫిబ్రవరి నెలలో కాశీలో పది రోజులు (పది రాత్రుళ్ళు+పది పగళ్ళు) ఆ విశ్వేశ్వరుని సన్నిధిలో గడపటానికి వెళ్లాం.

అక్కడ ప్రతిరోజూ అర్ధ రాత్రి ఒంటిగంట, ఒంటిగంటన్నరకల్లా లేచి, స్నానం చేసి, చెప్పులు లేకుండా గుడికి నడిచి వెళ్లి లైన్ లో నుంచునే వాళ్ళం. 4 గంటలకి మాత్రమే స్పర్శదర్శనం దొరికేది. పొద్దున్న 4. 30 తరవాత స్పర్శ దర్శనం ఉండదు, అంటే శివలింగాన్ని మనం ముట్టుకోలేమన్నమాట. అందుకనే అంత తొందరగా గుడికి దర్శనానికి వెళ్ళటం.

అదే సమయానికి రోజూ మాకు ఆ గుడిలో ఒక స్వామీజీ తారసపడుతుండేవారు. మెడ నిండా రుద్రాక్షమాలలు, నుదుటి మీద విభూతి చారలు, చూడగానే నమస్కరించాలనిపించేది. ఇంకొక తెలుగావిడ కూడా వచ్చేవారు. ఇద్దరూ గుడి ముందు ఉన్న గణపతికి పూజ చేసి హారతి ఇచ్చి లోపల దర్శనానికి వెళ్లేవారు. ఒకరోజు ఆ తెలుగావిడ మాతో అన్నారు కదా! 'ఆ స్వామి ప్రతి సంవత్సరం మానస సరోవరం నడిచి వెడతారు. ఆయనకి ఏమైనా డబ్బులు ఇవ్వండి, మంచిది' అన్నారు. నేను మా వారితో సరే ఇవ్వండి, మనం వెడతామో లేదో తెలియదు. కనీసం వెళ్లే ఆయనకి అయినా డబ్బులు ఇద్దాం అంటే, నా జేబులో 100 రూపాయలే ఉన్నాయి అన్నారు. సరే ... ఇవ్వండి ఎంతో కొంత అని ఆయనకి ఆ డబ్బులు ఇచ్చి వారి కాళ్లకు దణ్ణం పెట్టాం. ఆ స్వామీజీ మాకు అక్కడ తారసపడటం కాకతాళీయం కాదు అని మాకు అప్పుడు తెలియలేదు. కాశీ నుండి హైదరాబాదు తిరిగి వచ్చిన మర్నాడు అనుకుంటా, సడెన్ గా మావారన్నారు 'మనం కూడా కైలాష్ మానససరోవరం యాత్ర చేద్దాం' అని. నేను ఎగిరి గంతేసినంత పనిచేసాను. ఇంక మొదలైంది మా కైలాష్ యాత్రకు వివరాల సేకరణ..

మానస సరోవరం వెళ్లి వచ్చాం అన్న వాళ్లందరినీ, వాళ్లకి విసుగు వచ్చే వరకు ఎన్నో ప్రశ్నలు వేశాం. ఏ ఏజెంట్ దగ్గర ఎంత రేటో కనుక్కుని, బస్సులో వెడితే ఎలా ఉంటుందో, విమానంలో వెడితే ఎలా ఉంటుందో, ఎంత అవుతుంది ? అన్నీ తెలిసిన వారి నందరినీ అడిగాము. చివరకు మా క్లాస్ మేట్ వాళ్ళు వెళ్లి వచ్చాం అంటే వాళ్ళని కనుక్కుని, వాళ్ళు

వెళ్లిన ఏజెంట్ ద్వారా (కైలాష్ జర్నీస్)వెళ్లాం. మా ఫ్రెండ్ పద్మ, కొల్లూరి మూర్తి గారు. వాళ్ళిద్దరూ బెంగుళూరులో ఉంటారు. వాళ్ళు విమానంలో వెళ్లారు. మేము బస్సులో (రోడ్ మార్గం) వెడదాము అని నిర్ణయించుకున్నాము. ప్రకృతి చూస్తూ వెళ్ళవచ్చు, విమానంలో చాలా సార్లు ప్రమాదాలు వింటూఉండడం, కూడా కారణాలు. మా ఫ్రెండ్ సుబ్బలక్ష్మి 'ముక్తీనాథ్ కూడా ఏకంగా చూసేసి రండి, మళ్ళీ మళ్ళీ వెళ్ళలేరు' అనడంతో మానస సరోవరంతో పాటు ముక్తీనాథ్ కూడా బుక్ చేసుకున్నాము. అన్నిటికీ కలిపి 3 లక్షల 16 వేల రూపాయలకు ఖాట్మండ్ ఏజెంట్ తో మాట్లాడి, మే నెలలో 30,000 రూపాయలు అడ్వాన్స్ పంపాము ఏజెంట్ కి. మిగతా డబ్బు జూలైలో కటతామని చెప్పాం. ఒప్పుకున్నాడు మా ట్రావెల్ ఏజెంట్. ఆ టిక్కెట్టు ఖాట్మండ్ నుండి ముక్తీనాథ్, ముక్తినాద్ నుండి ఖాట్మండ్ మళ్ళీ ఖాట్మండూ నుండి మానససరోవరం రాను పోను, ఇద్దరికీ కలిపి. హైదరాబాదు నుండి ఢిల్లీకి, ఢిల్లీ నుండి ఖాట్మండ్ కి, మళ్ళీ అదే రూట్ లో తిరుగు ప్రయాణానికి విమానం టికెట్లు మనమే బుక్ చేసుకోవాలి.

మా ఫ్రెండ్ భర్త కే.ఎస్. మూర్తి గారు అన్ని విషయాలు చాలా వివరంగా చెప్పారు. వారిద్దరూ ప్రతీదీ చెప్పడం మాకు చాలా ఉపయోగకరమైంది.

అంతే కాదు, మన రచయితలు పోడూరి శ్రీనివాసరావుగారు, రామానందం గారు, మా ఇంకో క్లాస్ మేట్ సుబ్బలక్ష్మి అలా ఎందరో ఇచ్చిన సలహాలతో మా ప్రయాణం టిక్కట్లు (హైదరాబాద్ - ఢిల్లీ -ఖాట్మండూ, తిరుగు ప్రయాణానికి) బుక్ చేసుకోవడం వరకు వచ్చింది. ఆ టిక్కట్లు మే 1న మా తమ్ముడి సలహాతో (మా తమ్ముడు విమాన ప్రయాణాలు బాగా చేస్తూ ఉంటాడు) బుక్ చేశాము. రు.32 వేలు అయింది ఇద్దరికీ కలిపి. అప్పటికి మా ప్రయాణానికి మూడు నెలల సమయం మాత్రమే ఉంది. ఈ మూడు నెలలూ రోజూ బాగా వాకింగ్ చేసి, యోగా చేసి, ప్రయాణానికి ఫిట్ గా తయారౌదామని అనుకున్నాము.

ఇంతలో అనుకోని ప్రయాణం పడింది అమెరికాకి. ఓ రెండు నెలలు అక్కడకు రమ్మని మా అమ్మాయి ఫోన్ చేసింది. సరే, కైలాష్ మానససరోవరం ట్రిప్ కి ప్రిపరేషన్స్ పక్కన పెట్టి, మే 23 వ తేదీన అమెరికా బయలుదేరాం. వెళ్లేముందు మా అమ్మాయికి చెప్పాం 'ఏమైనా సరే ఆగస్టు మొదటి వారానికి మమ్మల్ని వెనక్కి పంపించేయాలని'. అలాగే అంది మా అమ్మాయి.

వెళ్లేముందు మేము కట్టవలసిన మిగిలిన రెండు లక్షల ఎన-

భైఆరు వేల రూపాయలు మా బావగారికి ఇచ్చాం జూలై నెలలో మా ఏజెంట్ కి పంపించమని.

మనిషి సంకల్పానికి దైవ సంకల్పం తోడయితే అది ఎంత బలవత్తరమో అమెరికా-లో జరిగిన ఒక ఘటన ద్వారా తెలిసింది. అమెరికాలో ఉన్న-న్నాళ్ళూ మా అమ్మాయి మమ్మ-ల్ని అంత రిస్కీ జర్నీ ఎందుకు, మీరు కైలాష్ ట్రిప్ మానేయ్యం-డి అని బ్రతిమాలుతూనే ఉంది. వేలమంది భక్తులు వెళ్లి వస్తున్నా-రు, భయమేమీ లేదు అని ఎంత చెప్పినా తను కన్విన్స్ అవలేదు. పిల్లలకి అంత ఇష్టం లేనప్పు-డు ఏం వెళతాంలే, కైలాష్ ట్రిప్ కేన్సిల్ చేసుకుందాం అని నిశ్చ-యించుకున్నాం. ఎల్లాగో దగ్గర దగ్గర మూడు లక్షలు ఇంకా ఏజెంట్ కి కట్టాల్సి ఉందిగదా , దాన్ని ఆపేద్దాం, అని అనుకుని మా బావగారికి ఫోన్ చేసాం డబ్బులు ఆపెయ్యండి,కట్టకం-డి అని. 'అరే ఇప్పుడే, ఓ గంట క్రితమే, బ్యాంక్ లో కట్టి వచ్చాను' అని మా బావగారు చెప్పారు.

అప్పుడు అనిపించింది మా సంకల్పానికి ఆ పరమేశ్వరుడి సంకల్పం తోడయ్యింది, మేము మానేద్దామనుకున్నా ఆయన మమ్మల్ని ఆక్కడికి రప్పించుకో-వటానికి 'డిసైడ్' చేశాడు అని. ఆయన ఆజ్ఞ లేకుండా వెళ్ళ-లేము, ఆయన ఆజ్ఞ అయిన తరువాత వెళ్ళకుండా మానలేము అని అప్పుడు తెలిసింది.

అసలు రోడ్డు మార్గం ఎలా ఉందా అని వీడియోలు పెట్టి చూసాము.విమాన ప్రయాణం కన్నా ఈ ప్రయాణం బాగుంది అని పరిక్రమ చెయ్యద్దు అని వాగ్దానాలు చేయించుకుం-ది మా అమ్మాయి. ఇండియా వెళ్ళిన తరువాత మీకు షాపింగ్ కు సమయం ఉండదు. ఇక్కడే కానిచ్చేద్దురుగాని అని అంది మా అమ్మాయి. హ్యూస్టన్ లోని కేటీ మాల్ కి బయలుదేరదీసిం-ది. అక్కడ ట్రెక్కింగ్ యాక్ససరీస్ షాప్ లో మాకు ట్రెక్కింగ్ షూస్, డబుల్ లేయర్ పాంట్లు, థర్మల్ ఇన్నర్లు, స్వెట్టర్లు, వులెన్ సాక్స్, గ్లౌస్, గాగుల్స్, డిస్పోజబుల్ బెడ్ షీట్స్, వెట్ వైప్స్, ఎనర్జీ బార్లు, ఇలా ఒకటేమిటి... చాలా కొనిపె-ట్టారు మా అమ్మాయి, అల్లుడు.

మా అబ్బాయి, కోడలు గో ప్రో (GoPro) వీడియో కెమెరా కొని మీకు అక్కడ వీడియోలు తీసు-కోటానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఇది మనం తలమీద హెడ్ బ్యాండ్ కు పెట్టేసుకోవచ్చు. అప్పుడు మనం చూసేదంతా కెమెరా కూడా చూస్తుంది. మన చేతులు ఫ్రీగా ఉంటాయి. ఇది చాలా ఉపయోగకరమైన సాధనం. పైగా ఇది వాటర్ ప్రూఫ్ కూడా. ఇది మనం కారు డేష్ బోర్డ్ మీద పెట్టుకుంటే, మనం కార్లో వెళ్తున్నపుడు మన ముందు జరిగేదంతా వీడియో తీస్తుంది. ఎప్పుడైనా ట్రాఫిక్ ఉల్లంఘనల గురించి ట్రాఫిక్ పోలీసుతో వాదిం చాల్సి వస్తే ఇది మనకి సాక్ష్యంగా బాగా ఉపయోగపడుతుంది.

అలా మొత్తం సరంజామా వేసుకుని, ఆగస్టు 5 న తెలతెల-వారుతూండగా చేరాము.

ఈ కైలాష్ మానససరోవరం అన్న పుణ్య క్షేత్రం టిబెట్ లో ఉంది. టిబెట్ చైనా ఆధీనంలో ఉన్న ప్రాంతం కాబట్టి మేమంతా-(ఈ యాత్ర చేసేవాళ్ళం అందరూ) చైనా ప్రభుత్వ వీసా తీసుకోవాలి. దీనికోసం మన పాస్ పోర్ట్ లను మన ఏజెంట్ కి ఇస్తే, ఆతను చైనీస్ ఎంబసీలో గ్రూప్ వీసా తయారుచేయిస్తాడు.అందుకని మేం ఇండియా రాగానే చేసిన మొదటి పని మా పాస్ పోర్ట్ లను మా ఏజెంట్ కి పంపడం. ఆతను మాకు పాస్ పోర్ట్ లను ఖాట్మండు లో ఇచ్చేటట్టు, మేం ఖాట్మండూ దాకా ప్రయాణానికి మా వోటర్ ఐడెంటిటీ కార్డు సహాయంతో వె-ళ్లేటట్టు డిసైడ్ అయింది. మా ఆడపడుచుగారి అమ్మాయి, అల్లుడు కుడా ఆగస్టు 21న వాళ్ళు జగ్గి వాసుదేవ్ గ్రూప్ లో వెడుతు-న్నారు. మా ప్రయాణం ముందు వాళ్ళుఎంతో ప్రేమగా వచ్చి మాకు తగు సూచనలు ఇచ్చి వెళ్ళారు.. ఆగస్టు 13 పొద్దున్నే విమానంలో బయలుదేరి ఢిల్లీ, అక్కడనుం-డి ఖాట్మండ్ 13 సాయంత్రానికి జేరాము.

(మళ్ళీ వచ్చే నెల కలుద్దాం)

వేమూరి వేంకటేశ్వరరావు

భవిష్యత్తులో భారతదేశానికి మరొక స్వర్ణయుగం ఉందా?

గత అయిదు వేల సంవత్సరాలలోనూ ఎన్నో రంగాలలో విశేష ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన భారతదేశం సైన్సులో, గత సహస్రాబ్దంలో, ఒక్క స్వర్ణయుగాన్నైనా సృష్టించలేకపోయింది. ఈ దృగ్విషయానికి కారణం ఏమై ఉంటుందా అని అన్వేషించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

స్వర్ణయుగం - ఒక నిర్వచనం

చరిత్రాత్మకంగా చూస్తే ఎన్నో రంగాలలో భారతదేశం ఉత్తుంగ శిఖరాలని అధిరోహించిందన్న విషయం సర్వజన విదితం. వేదాలు మానవకోటికి ఆది గ్రంథాలు. పాణిని వ్యాకరణం ప్రపంచంలోనే మొదటి వ్యాకరణం. ఎన్నటికీ తుప్పు పట్టని డమాస్కస్ కత్తులు డమాస్కస్ విపణి విధులలో అమ్మేవారు కనుక వాటికీ ఆ పేరు వచ్చింది కానీ అవి నిజానికి భారతదేశంలో తయారయినవే! నాగలి, గీట్లబద్ద, త్రాసు భారతీయులు కనిపెట్టినవే! చదరంగం ఆట భారతదేశంలోనే పుట్టింది!

అరబిక్ అంకెలుగా చలామణీ అవుతున్న ఈనాటి అంకెలని రాయడానికి మనం వాడే గురుతులు భారతదేశంలో పుట్టినవే. దశాంశ పద్ధతిలో లెక్కపెట్టడం, సున్నకి ఒక ప్రత్యేకమైన గుర్తుని కల్పించడం, స్థానబలం సూత్రం - ఇవన్నీ భారతీయులు కనిపెట్టినవే. ఈనాడు మనం త్రిగుణమాత్రుకలో వాడే "సైను" అన్నమాట భాస్కరాచార్యులు వాడిన "జీవ" కి భ్రష్టరూపం అంటే ఎంతమంది నమ్ముతారు? సంస్కృతంలోని "జీవ" అరబ్బీలో "జ్ బ్" అయి అక్కడనుండి స్పెయిన్, ఇటలీ దేశాల ద్వారా ఇంగ్లీషులోకి జొరబడి "సైన్" గా రూపాంతరం జరగడం వెనక ఉన్న కథ వేరొక చోట ప్రస్తావించేను.

ఫిబొనాచీ సంఖ్యలని ఫిబొనాచీ కాలానికి రెండు వందల సంవత్సరాల ముందే భారతదేశంలో "హేమచంద్ర" కనుక్కున్నారు అని మంజుల్ భార్గవ ఒకచోట అన్నారు. పాస్కల్ త్రిభుజాన్ని నిజానికి పింగళ త్రిభుజం (సా.శ.పూ. 200 సంవత్సరాలు) అనాలి. టిప్పు సుల్తాన్ మొదటిసారి రాకెట్లని యుద్ధంలో వాడేడు. తీగలు లేకుండా సమాచారాన్ని ప్రసారం చేసే పద్ధతిని మార్కొని కంటే రెండేళ్లు ముందే జగదీశచంద్ర బోస్ కనుక్కున్నారు.

ఓపిక, చోటు, సమయం ఉంటే ఇటువంటి సృజన వ్యాపారానికి కారణభూతులైన మహానుభావులని తలుచుకుని ఆత్మస్తుతి చేసుకోవచ్చు. వాల్మీకి, వ్యాసుడు, ఆదిశంకరుడు, కాళిదాసు, తులసీదాసు, ఆర్యభట్టు, భాస్కరుడు, శుశ్రుతుడు, నన్నయ, పోతన, పెద్దన, జక్కన, త్యాగరాజు, టాగోర్, రామానుజన్, రామన్, చంద్రశేఖర్, విశ్వేశ్వరయ్య,..., ఇలా ఎందరో మహానుభావులని కన్న దేశం మనది. కానీ వీరిలో-

చాలా మంది ఎడారిలో ఎండమావిలా, మహాసముద్రంలో పగడపుదిబ్బలా, నీలాకాశంలో మెరిసే నక్షత్రంలా ఏకాంతంగా, వ్యష్టిగా, ఒక్క మెరుపు మెరిసి ఆరిపోయారు; కొద్ది పరంపరలే నాలుగు కాలాలపాటు నిలిచి సంఘంలో సృజన వృక్షానికి నీరు పోసేయి. ఒక పరంపర కనీసం ఒక తరం పాటు నిలిచి ఒక సమాజంలో ఒక ప్రభంజనాన్ని లేవగొట్టినా, లేదా ఒక సమాజంలో అసాధారణ ప్రతిభాపాటవాలు ఒక పరాకాష్ఠ చేరుకొని, కొంత కాలం పాటు ఆ ఉన్నత స్థాయిని నిలుపుకోగలిగినా, ఆ కాలాన్ని స్వర్ణయుగం అంటారు.

భారతదేశంలో గుప్త సామ్రాజ్యం - ప్రత్యేకించి రెండవ చంద్రగుప్తుడి కాలం - ఒక స్వర్ణ యుగం. కాళిదాసు రచనలు, అజంతా గుహలలోని వర్ణచిత్రాలు, ఆయుర్వేదం, ఈ కాలం నాటివే. కృష్ణదేవరాయలు పాలించిన పాతికేళ్లు తెలుగు సాహిత్యానికి ఒక స్వర్ణ యుగం. మొదటి ఎలిజబెత్ కాలం ఇంగ్లీషు సాహిత్యానికి ఒక స్వర్ణ యుగం. ఇరవైయవ శతాబ్దంలో మొదటి ఏభయ్ సంవత్సరాలూ భౌతిక శాస్త్రానికి ఒక స్వర్ణ యుగం. ఎక్కడో, ఒకరో ఇద్దరో సృజనా వ్యాపారం చేస్తే అది స్వర్ణయుగం అనిపించుకోదు. ఒకచోట ఉద్భవించిన సృజనాంకురాలు వ్యాపించి, తామరతంపరలా వర్ధిల్లినప్పుడే అది స్వర్ణ యుగం నిర్వచనంలో ఇముడుతుంది. అందుకనే సి. వి. రామన్, సత్యేంద్రనాథ్ బోస్, మేఘనాథ్ సహా, ప్రభృతులు గణనీయమైన ఫలితాలు సాధించినప్పటికీ వారి కృషి మన దేశంలో ఆధునిక భౌతిక శాస్త్రంలో స్వర్ణ యుగం సృష్టించలేకపోయింది.

స్వర్ణయుగం - సృష్టించడం ఎలా?

మన దేశపు గత అయిదువేల సంవత్సరాల చరిత్రని వెతికితే కనిపించే ఇటువంటి స్వర్ణయుగాలు వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. చరిత్ర పుటలు వెనక్కి తిరగేసి చూస్తే ప్రతి స్వర్ణ యుగం పరాకాష్ఠ చేరుకోడానికి పాతిక, ముప్పయ్ సంవత్సరాల వ్యవధి సరిపోతుందని లెక్క తేలుతుంది. అంటే ఏ దేశం అయినా సరే శత్రువుల పోరు లేకుండా, స్వతంత్రంగా, సుభిక్షంగా, విశృంఖలంగా ఒక్క తరం పాటు ఉంటే అక్కడ ఒక స్వర్ణయుగం సృష్టించవచ్చు.

“స్వరాజ్య ప్రతిపత్తి వచ్చి, స్వేచ్ఛా వాయువులు పీల్చుకొనడం మొదలు పెట్టిన తరువాత రెండు తరాల కాల వ్యవధిలో దుర్భిక్షంగా ఉండే దేశాన్ని సుభిక్షం చేసుకున్నాం. భూగర్భంలో అణుబాంబులు పేల్చి, అంతరిక్షంలోకి రాకెట్లు పంపి, మంగల్యాన్ తో గ్రహాంతర ప్రయాణం చేసి కొన్ని సాంకేతిక రంగాలలో మన సత్తా చూపించి ఔరా అనిపించుకున్నాం. భారతదేశం ఒక వెలుగు వెలుగుతోందని పత్రికలు ఘోషిస్తున్నాయి. మన ప్రావీణ్యానికి ఏమి తక్కువ” అని కొందరు ప్రశ్నించవచ్చు.

నిజమే. కానీ అణు బాంబులు, రాకెట్లు, కంప్యూటర్లు, వగైరా మన దేశంలోపుట్టిన ఊహలు కావు. వేదాంత తత్త్వం, బౌద్ధం, యోగశాస్త్రం, ఆయుర్వేదం, దశాంశ పద్ధతి, చదరంగం, వ్యాకరణాన్ని సూత్రబద్ధం చెయ్యడం, బాస్మతి బియ్యం, మొదలైనవాటి మీద మన ముద్ర (“బ్రేండ్ నేమ్”) పడింది. ముద్ర బయటకి కనబడకపోయినా “అరబిక్ అంకెలు,” “డమాస్కస్ కత్తులు” కూడా భారతదేశానివే. గత సహస్రాబ్దంలో సైన్సు, టెక్నాలజీ రంగాలలో మన ముద్రతో ప్రపంచానికి కొత్త వస్తువులని కాని, కొత్త ఊహలని కాని వేటిని ఎగుమతి చేసేం?

మనకంటె ఎంతో చిన్న దేశమైన ఫిన్లండ్ పేరు వినగానే “నోకియా” వారి “సెల్ ఫోను” స్ఫురణకి వస్తుంది. స్వీడన్ పేరు తలచుకోగానే “ఐకియా” గుర్తుకి వస్తుంది. ప్రస్తుతం సైన్సు, టెక్నాలజీ రంగాలలో ఇండియా పేరు చెబితే వెంటనే మనస్సులో మెదిలేవి “కాల్ సెంటర్లు,” “ప్రోగ్రామర్లు.” బెంగుళూరుని “సిలికాన్ వేలీ” అనిన్నీ, హైదరాబాదుని “సైబరాబాద్” అనిన్నీ

ఎంత మొత్తుకున్నా కంప్యూటర్ రంగంలో మన దేశంలో పుట్టి, ఎగుమతి అయిన సృజనావ్యాపారం దరిదాపు సున్న. (ఫ్లిప్కార్ట్ ఒక ఎన్నదగ్గ మినహాయింపు!) "బహుళజాతి వ్యాపార సంస్థల వెనక గది"లో కూర్చుని "సైబర్ కూలి" చేసి డబ్బు గణించడం వేరు, ఆ రంగంలో సృజనాత్మకంగా కొత్త పుంతలు తొక్కి సరికొత్త విజ్ఞానాన్ని సృష్టించడం వేరు. విజ్ఞులతో సంప్రదించగా గణిత, భౌతిక రసాయన, జీవశాస్త్రాలు పరిస్థితి కూడ ఏమీ గర్వించదగ్గ స్థితిలో లేదని తెలుస్తోంది. నా మాటలు గుడ్డిగా నమ్మక్కర లేదు. పరపతి ఉన్న సైన్సు పత్రికలలో ప్రచురణలు, అంతర్జాతీయ విశిష్టాధికారాల (పేటెంట్ల) గణాంకాలు ఎంతో స్వయంబోధకాలు.

ఐదవ శతాబ్దం లగాయతు పన్నెండవ శతాబ్దం వరకు - అంటే ఆర్యభట్ట నుండి భాస్కరాచార్య దాకా - పాశ్చాత్య దేశాలలో కంటే భారత దేశంలోనే వైజ్ఞానిక స్ఫూర్తి, స్పృహ ఎక్కువగా ఉండేవి. ఆ రోజులలో ఆల్ బిరూని వంటి అరబ్బు శాస్త్రవేత్తలు బ్రహ్మగుప్తాదులు రచించిన గ్రంథాలని అరబ్బీలోకి తర్జుమా చేసుకునే నిమిత్తం భారత దేశం వచ్చి, సంస్కృతం నేర్చుకునేవారు. ఎనిమిది వందల సంవత్సరాల పాటు ఇలా వెల్లివిరిసిన భారతీయ సృజన తరువాత కాలంలో ఎందుకు కొనసాగలేదు? మళ్లా ఆ బంగారు రోజులు ఎప్పుడు వస్తాయి? ఎలా వస్తాయి?

పైన అడిగిన మొదటి ప్రశ్నే నోబెల్ గ్రహీత అబ్దుస్ సలాం కూడా అడిగేరు. భారతదేశంలో తాజ్ మహల్ నిర్మాణం జరిగిన పదిహేడవ శతాబ్దంలోనే ఇంగ్లండు లో సెయింట్ పాల్స్ కెథీడ్రల్ నిర్మాణం కూడా జరిగింది. స్థాపత్య శాస్త్రపు దృష్టిలో ఈ రెండూ మహోన్నతమైన కట్టడాలే! ఇటువంటి ఉత్కృష్టమైన శిల్పకళా చాతుర్యం రెండు విభిన్నమైన నాగరికతలలో, విస్తృతమైన దూరంతో విడదీయబడ్డ దేశాలలో, ఒకే కాలంలో - వార్తా ప్రసార సౌకర్యాలు లేని కాలంలో - మానవుడు సాధించగలగడం చెప్పుకోదగ్గ విషయమే. ఈ పరాకాష్ఠని చేరిన కొద్ది దశాబ్దాలలో, న్యూటన్ వంటి మేధావుల పర్యవేక్షణలో, ఇంగ్లండు, తదితర పాశ్చాత్య దేశాలు, ప్రగతి పథంలో పరుగులు తీస్తూ శాస్త్రీయ పురోభివృద్ధికి, రాబోయే స్వర్ణయుగానికి బీజాలు నాటుతూ ఉంటే మన దేశం తిరోగమన మార్గంలో పడిపోయింది. ఎందుకు ఇలా జరిగింది?

అంధకార యుగానికి కారణాలు

ఒక దేశం కాని, ఒక నాగరికత కాని అంధకార యుగంలో పడి కొట్టుమిట్టాడుతోందంటే దానికి ఒకటి కాదు, ఎన్నో కారణాలు ఉంటాయి. వాటన్నిటిని ఇక్కడ కూలంకషంగా పరిశీలించడం కుదరదు. చెలామణీలో ఉన్న కొన్ని ఊహలని పరిశీలిద్దాం. లండన్ లోని సెయింట్ పాల్ కెథీడ్రల్ నిర్మాణం సర్ క్రిస్టఫర్ రెన్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన పేరు ఇప్పటికీ మనం చెప్పుకుంటున్నాం. ఏదీ, తాజ్ మహల్ నిర్మాణం ఎవరి ఆధ్వర్యంలో జరిగింది? అతని/ఆమె ఊరు కాని, పేరు కాని, ప్రవర కాని ఎవ్వరికీ తెలియదు. ఆ స్థపతి చిత్రపటం కూడా ఎక్కడా కనబడదు. అంతే కాదు. తాజ్ మహల్ ని మించిన కట్టడం మరొకటి ఉండకూడదని ఆ స్థపతి చేతులు రెండూ షా జహాన్ నరికించివేశాడనే కథ కూడా ఆగ్రాలో ఉండే స్థల పురాణీకులు చెప్పగా విన్నాను. చేతులే నరికించేడో, కళ్లే పొడిపించేడో, తలే తీయించేడో మనకి తెలియదు. కాని ఆ స్థపతి ఎవ్వరో మనకి తెలియదన్న విషయం మాత్రం మనకి తెలుసు. పోనీ, ఆ స్థపతికి శిష్యులు లేదా? ఆ పరంపర ఏమైపోయింది? స్థపతి పరిస్థితే ఇలా ఉన్నప్పుడు "రాళ్ళెత్తిన కూలీలెవరో?" అని మనం ఆక్రోశించి ఏమి లాభం? షా జహాన్ తాజ్ మహల్ ని ఒక కళని పోషించడానికి కట్టించేడా? తన "అహం" ని పోషించడానికి కట్టించేడా?

కళాపోషణ విషయంలో మనకి, పాశ్చాత్యులకి మధ్య కొన్ని తేడాలు కనబడతాయి. పాశ్చాత్య దేశాలలో ప్రభువులు "లలిత కళలని" పోషించిన చేత్తోటే "సైన్సు" ని కూడా పోషించారు. ఇటువంటి ప్రాపకం ఉండబట్టే ఉత్సాహం ఉన్న యువకులు ప్రయోగశాలలు స్థాపించి కొత్త పుంతలు తొక్కడానికి అవకాశం దొరికింది. డెన్మార్క్ లోని ఉరనిబర్గ్ లో టైకో బ్రాహే స్థాపించిన ఖగోళ వేధశాల దీనికి ఒక ఉదాహరణ. ఈ ప్రయోగశాలలోనే టైకో బ్రాహే గ్రహాల స్థితిగతుల దత్తాంశాలని నిద్రాహారాలు లేకుండా సేకరించబట్టే కదా కెప్లర్ గ్రహ గమనాలని సూత్రబద్ధం చెయ్యగలిగేడు. ఈ సూత్రాలే నూటన్ లేవదీసిన మహా సౌధానికి పునాది రాళ్ళు అయేయి! ఇదే బాణీలో ఫ్రాంసు రాజు స్థాపించిన "ఫ్రెంచి ఎకాడమి" మరొక ఉదాహరణ.

ఇండియాలో ప్రభువుల ప్రాపకం లేకేమి? మొగలాయీ చక్రవర్తులు కళాపోషణ చేసేరే. రాయలవారు కవిత్వాన్ని పోషించేరే. కాని మన రాజులకి పాశ్చాత్య ప్రపంచంలో పెను తుపానులా విరుచుకు పడ్డ సైన్సు ప్రభంజనపు తాకిడి తగల లేదు. మన రాజుల కొలువులలో కవులకి వేసిన పెద్ద పీటలు కనిపిస్తాయి కానీ, ఒక భాస్కరాచార్యకీ, ఒక శుశృతుడికీ వేసిన పీటలు పెద్దగా కనిపించవు. (ఎక్కడో ఆస్ట్రేలియాలో, ఒక వైద్య కళాశాలలో శుశృతుడి విగ్రహం ఒకటి ఉంది. ఇండియాలో ఎక్కడా లేదు!) ఎందుకు ఇలా జరిగింది? ఈ రకం ప్రశ్నలకి రకరకాల కోణాలలో సమాధానాలు వెతకవచ్చు.

పాశ్చాత్యుల చేతులలో సైన్సు ఒక పనిముట్టు. తమ జీవన ప్రమాణాన్ని పెంచుకుందికి వారు సైన్సుని ఒక ఆయుధంగా వాడుకున్నారు. పదహారు, పద్దెనిమిది శతాబ్దాల మధ్య కాలంలో భారతీయులకి సైన్సు యొక్క పటిమ, శాస్త్రీయ పద్ధతి యొక్క పటిమ పరిపూర్ణంగా అవగాహన అయినట్లు కనిపించదు. ఈ నిర్లిప్తతకి కారణం ఏమై ఉండొచ్చు? సమాధానం మనం పుట్టి పెరిగిన నేపథ్యం మీద, మన వ్యవస్థలోని విలువల మీద ఆధారపడి ఉండొచ్చు.

యూరప్ లో వాతావరణం దుర్భరం. అక్కడ చలి ఎక్కువ. శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు వెతికినట్లు, ఈ చలి బారి నుండి తప్పించుకుందుకి వారు కనిపెట్టిన ఉపాయాలలో "టెక్నాలజీ" - అనగా, సైన్సుని సమాజానికి ఉపయోగపడేలా వాడుకునే పద్ధతి - ఒకటి. మన దేశంలో వాతావరణం చాలమట్టుకి సమతుల్యంగా ఉంటుంది. కనుక ఒంటి మీద బట్ట లేకపోయినా పరవాలేదు, నెత్తి మీద కొప్పు లేకపోయినా పరవా లేదు. కడుపు నిండితే చాలు, రోజు గడచిపోతుంది. కనుక పంచభూతాలనీ లొంగదీసుకునేందుకు సైన్సుని చేరదీసి పోషించవలసిన అవసరం లేకపోవడంతో దాని మీద తూష్ణీంభావం పుట్టి ఉండవచ్చు. ఇదొక వాదం.

"మన దేశంలో రోజు గడవడం తేలిక" అని నేను ఇప్పుడు అంటే నవ్వుతారు. పాశ్చాత్యులకి చలి బాధ ఉన్నట్లే మనకి వేడి బాధ ఉంది కదా. మన వాటా కరువులు, కాటకాలు, రోగాలు, రొచ్చులు మనకీ ఉన్నాయి. కానీ ఈ అరిష్టాలు ఎదురయినప్పుడు, "మన కర్మ" అని చప్పరించేసి ఉరుకుంటాం. రాబోయే జన్మ మీద ఉన్న గురి మనకి ఈ జన్మ మీద లేదు. విషయ వాంఛలని చంపుకోవడం, శారీరక సుఖాలని విస్మరించడం, స్థితప్రజ్ఞకి లక్షణాలు. ఐహిక సుఖాలని అనుభవించడానికి కావలసిన ప్రచోదనం ('ఇన్సెంటివ్') ఎవ్వరిలోనైనా ఉంటే ఈ వేదాంత దృక్పథం మొగ్గలోనే తుంచేసి ఉంటుంది.

సైన్సు, టెక్నాలజీ పాశ్చాత్య దేశాలలో ఉద్భవించి, వెల్లివిరుస్తున్న దశలో మన దేశం నిద్రపోయింది. పన్నెండవ శతాబ్దం వరకు ఉన్న సృజన క్రమేణా హారతి కర్పూరంలా హరించిపోయింది.

(మిగిలినది వచ్చే సంచికలో)

పాలెపు బుచ్చిరాజు

ముల్లా నస్రుద్దీన్ కథలు - 5

గెలిచింది గుర్రం

అరేబియన్ దేశాలు మంచి జాతి గుర్రాలకి ప్రసిద్ధి చెందినవి. అక్కడ చాలా మందికి గుర్రాల వ్యాపారమే వృత్తి. మన నస్రుద్దీన్ కి కూడా గుర్రాలంటే చాలా ఇష్టం. కాని వాటిని కొనుక్కుని పోషించగల స్తోమత లేని వాడు. అందు వల్ల అప్పుడప్పుడూ తెలిసిన వాళ్ళ దగ్గర ఒక గుర్రాన్ని అరువు తెచ్చుకుని సవారి చేస్తూ ఉండేవాడు.

ఒకసారి అలాగే ఒక గుర్రాన్ని అరువు తెచ్చుకుని, దాని మీద బజారులో సవారి చేస్తూ తిరుగుతున్నాడు. కాని అది బక్క చిక్కిన గుర్రం.ముసిల్ది.సరైన పోషణ లేక ఈసురో మని ఉంటుంది. కాని అరువు కావాలంటే అంత కంటే మంచి గుర్రాన్ని ఎవరు ఇస్తారు? దొరికిందే చాలని హుషారుగా దానినెక్కి తిరుగుతున్నాడు.

ఇంతలో ఒక గొప్ప గుర్రాల వ్యాపారి తన సొంత గుర్రం మీద ఎక్కి ఆ సంతలో తిరుగుతూ అతని కంట బడ్డాడు. అతని గుర్రం మంచి జాతిది.కోట్ల ఖరీదు చేస్తుంది. అదీకాక అతను దానిని చక్కగా అలంకరించాడు కూడా. మీసం మెలేసుకుంటూ, గర్వంగా సవారి చేస్తున్నాడు. అతని దగ్గర అలాంటి జాతి గుర్రాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. వాటిని అమ్మడానికే అతను ఇక్కడికి వచ్చాడు.

అతను, చింపిరి గుడ్డలేసుకుని, బక్క చిక్కిన గుర్రం మీద తిరుగుతున్న నస్రుద్దీన్ ని చూసి ఒకటే నవ్వసాగాడు. మొదట నస్రు అతన్ని లెక్క చెయ్యకపోయినా, అతను తన వైపే వేలెత్తి చూపిస్తూ నవ్వుతుంటే, ఓర్వలేకపోయాడు నస్రుద్దీన్. కోపం వచ్చింది. వెంటనే అతనికి అడ్డుపడి,

"ఏం? ఎందుకలా నవ్వుతున్నావు?" అని అడిగాడు.

అతను ఇంకా గట్టిగా నవ్వుతూ, "ఏమిటి? నువ్వూ, నీ వేషమూను. పిచ్చివాడిలా బక్క చిక్కిన గుర్రాన్నెక్కి తిరుగుతున్నావు? ఆ గుర్రం కూడా నీలాగే ఉంది. చూడు! నా గుర్రం ఎంత బాగుందో! ఇదీ, గుర్రం అంటే. నువ్వెక్కిందీ గుర్రమేనా! " అని హేళన చేశాడు.

పదిమందిలో తనని అవమాన పరిచి నందుకు వాడికి తగిన శాస్తి చెయ్యాలని, ఇలా అన్నాడు.

" ఇదేదో అల్లాటప్పా గుర్రం అనుకుంటున్నావు. దీని సంగతి నీకు తెలియదు." అన్నాడు.

"ఆహా! నీ ముసిలి గుర్రం అంత గొప్పదేం? కళేబరంలా ఉంది.ఏం చేయగలదేమిటి?" అని ఎదురు ప్రశ్న వేశాడు ఆ ధనవంతుడు.

"ఏం చేస్తుందో చూపిస్తాను పందెం వేస్తావా?" అన్నాడు నస్రు. ఆ షావుకారు ఇంకా రెచ్చిపోయాడు. నాతో తూగగల పందెం వేసేవాడివా నువ్వు అని మనసులోనే అనుకుని,

"సరే! అయితే, నీ గుర్రం చేసిన పని నా గుర్రమూ చేయగలదు. నీ గుర్రం గెలిస్తే, నీకు నేను ఏభై బంగారు కాసులు ఇస్తాను.

(47 వ పేజీ చూడండి)

పోడూరి శ్రీనివాసరావు

జన్మదిన శుభాకాంక్షలు

"అష్ట వర్షాత్ భవే కన్యా.." అన్నారు ఆర్యులు. పూర్వకాలంలో బాల్యవివాహాలు జరుగుతున్న రోజుల్లో... కన్యాశుల్కం ముమ్మరంగా ప్రాచుర్యం ఉన్న రోజుల్లో.... సుమారు ఎనిమిదేళ్ళ వయస్సు వచ్చేసరికి, చిన్న పాప అనైనా చూడకుండా ఎవరికో ఒకరికి ముడెట్టేసేవారు... కన్యాశుల్కం తీసుకుని ఎనిమిదేళ్ళ పాపను-ఎనభై ఏళ్ల ముదుసలికి కట్టబెట్టేసేవారు. మీకు ప్రత్యక్షసాక్ష్యం ఉందిగా... శ్రీ గురజాడ అప్పారావు గారి రచన - 'కన్యాశుల్కం'. ఒక్కసారి వంద సంవత్సరాలు వెనక్కి వెళ్లి... 'లుబ్దావధాన్లు' ని గుర్తుచేసుకోండి.

'ఎనిమిది' అన్న అంకెకు అంత ఆకర్షణ ఉంది. 8 - పూర్ణ చంద్రుడిపై మరో పూర్ణచంద్రుడు నిలుచున్నట్టు ఎంత అందంగా ఉందో కదా - ఎనిమిది అన్న అంకె. చిన్నిపాపాలో కూడా ఎనిమిది సంవత్సరాలు దాటినప్పటినించీ ... శారీరకమైన మార్పులు రావడం తెలుస్తుంది. అందాలు బహిర్గతమౌతుంటాయి. ప్రవర్తనలో కూడా - ఆడా - మగా తేడా, మగపిల్లలతో కలిసి తిరగడం తగ్గించడం, దానికి తోడూ ఇంట్లో పెద్దవాళ్ళ ఆంక్షలు... 'మగరాయుడిలా వాడితో ఆ కబుర్లేమిటే ! కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకో! నువ్వాడపిల్లవన్న విషయం మర్చిపోయావా.. ఏమిటి?' అంటూ సుతారంగా మందలింపులు, నిఘాలు, ఆంక్షలు, కట్టుబాట్లు, కట్టడి చేయడాలు... అబ్బో.. ఇలా ఒకటేమిటి? ఒక విధంగా చెప్పాలంటే 'మార్పు' మొదలవుతుంది.

ఇంతకూ ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే .... ఇక్కడ కూడా మార్పు మొదలవుతోంది... మార్పు అనివార్యం అవుతోంది. మనందరి ఆత్మీయ, అభిమాన మాసపత్రిక - 'చైతన్యం సంకల్పబలం' ఎనిమిదో పుట్టినరోజు జరుపుకోబోతోంది - ఈ దసరాలకు. అంటే పత్రిక ప్రచురణ ప్రారంభించి, ఏడు సంవత్సరాలు పూర్తి చేసుకుని, ఎనిమిదో వార్షికంలోకి అడుగిడబోతోంది. గత ఏడు సంవత్సరాలుగా ఎంతో సమర్ధవంతంగా ... ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని, అత్యంత జనాదరణను చూరగొన్న పత్రికగా - సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ పత్రిక - మన పత్రిక. శ్రీమతి తీగవరపు శాంతిగారు, ఈ పత్రికకు ఏరోజున 'చైతన్యం సంకల్పబలం' అని పేరు పెట్టి, పత్రికను వెలువరిద్దామని సంకల్పించుకున్నారో ... ముహూర్తబలమో, లేక అందరు రచయిత (త్రు)ల సహృదయ ఆశీస్సుల బలమో గాని, నిరాటంకంగా... నిర్విఘ్నంగా... నిర్విరామంగా పత్రిక వెలువడుతూనే ఉంది.

ప్రింటు మేగజైన్ గా ప్రారంభమైన ఈ పత్రిక, కొన్నాళ్ళ తర్వాత, సుమారు 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిదప, అంతర్జాల ఎడిషన్ ను కూడా తీసుకువచ్చారు. పుస్తకాలు చదివే అలవాటు

కనుమరుగవుతున్న ఈ మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ అంతర్జాల ఎడిషన్ తీసుకురావటం ఎంతో అభినందనీయం.

శ్రీ భువనచంద్ర, శ్రీమతి నండూరి సరోజాదేవి, ... శ్రీమతి ఆదూరి హైమవతి, శ్రీ కవనశర్మ, శ్రీ వేమూరి వేంకటేశ్వరరావు, శ్రీ చిలకమర్తి దుర్గాప్రసాదరావు, శ్రీ నందుల ప్రభాకరశాస్త్రి, శ్రీ పోడూరి శ్రీనివాసరావు, శ్రీ పాలెపు బుచ్చిరాజు, శ్రీ శనగవరపు కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీ తుమ్మూరి రామమోహనరావు, శ్రీ పోచినపెద్ది మురళీకృష్ణ, శ్రీ ఎలక్ట్రాన్, శ్రీ, కొత్త రామానందం, శ్రీ జనార్దన ఠాకూర్, కీ.శే. వల్లూరి సుబ్రహ్మణ్యశర్మ, శ్రీమతి భారతి ...ఇలా ఎందఱో మహానుభావులను, ఎంచుకుని, ఏరికూర్చుకుని, వివిధ సుగంధ పుష్పాలను మాలలల్లి, సాహితీమిత్రుల గళాలను ఆలంకరింపజేసిన ఘనత సోదరి శ్రీమతి శాంతి గారిదే.

శాంతి గారి మాసపత్రిక - చైతన్యం - ఎనిమిదేళ్ళ పాప అయింది. ఈ దశలో వచ్చే మార్పుల్లా పత్రికలో కూడా మార్పులు అనివార్యం. పైగా ప్రస్తుత పోటీలో, వివిధ రకాల ప్రక్రియలు కొత్త పుంతలు తొక్కుతున్న ఈ తరుణంలో - స్థాయి దిగజారకుండా మరింత అందంగా, ఆకర్షణీయంగా, నూతన విధానాలను చొప్పిస్తూ, కొత్త శీర్షికలకు స్థానం కల్పిస్తూ ... దసరా ప్రత్యేక సంచికను ... ఎనిమిదవ జన్మ దిన సంచికను శ్రీమతి శాంతి గారు ఎలా వెలువరిస్తారో అని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను.

గత నాలుగు సంవత్సరాలుగా, ఈ పత్రికా ప్రచురణలో కూడా భాగమైనందుకు గర్విస్తూ, జన్మదిన సందర్భంగా ప్రచురణకర్తలకు, తోటి రచయిత(త్రు)లకు, పాఠకులకు, దసరా శుభాకాంక్షలతో బాటు, బతకమ్మ పండుగ శుభాకాంక్షలతోబాటు, జన్మదిన శుభాకాంక్షలు అందజేయుచున్నాను.

గత ఎనిమిది సంవత్సరాలుగా మన పత్రికను విశేషంగా ఆదరించి అభిమానిస్తున్న పాఠకచక్రవర్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు. అశేష పాఠకులు ఇదే విధంగా మున్ముందు కూడా ఈ పత్రికను ఆదరించి, అభిమానించి, ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాను.

మీ

శ్రీనివాసరావు

98494 22239

(Wr.Ln.PODURI SREENIVASARAO)

రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు

చైతన్యం సంకల్ప బలం

చందా రేట్లు

విడిప్రతి	రూ. 20.00
సంవత్సరానికి	రూ. 200.00
పోస్ట్ ద్వారా	రూ. 230.00

Please deposit your subscription in favour of
CHAITANYAM SANKALPABALAM
A/c No. 1626201002070 - Canara Bank
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:

Chaitanyam Sankalpabalam,
45058, Janapriya Utopia,
Hyderguda, Attapur
Hyderabad - 500 048

Email: teega51@gmail.com
visit: www.chaitanyam.net

అరవై దాటాక జీవితవిధానంలో తీసుకోవలసిన మార్పులు

అక్టోబర్ 1 అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

జి. నిర్మల

మన జీవితంలో 60 ఏళ్ల వయసుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ వయసులో వచ్చే శారీరక, మానసిక, ఆరోగ్య మార్పులను బట్టి మన జీవనవిధానంలోనూ మార్పులు తెచ్చుకోవాలి. అరవై ఏళ్ల వయసు దాటినవారిని వరిష్ట పౌరుల (సీనియర్ సిటిజెన్స్) గా గుర్తించి, అనువైన ప్రత్యేక పథకాలు, రాయితీలు రూపొందించారు. మరి పెద్దలకు అందుబాటులో ఉన్న సామాజిక భద్రతా పథకాలు, అమలులో ఉన్న పొదుపు, ఫింఛను, ఋణ, భీమా రాయితీ పథకాల గురించి తెలుసుకుందాం!

ఉద్యోగం చేస్తున్న రోజులు క్రమం తప్పకుండా ఆదాయం వస్తుంది. పదవీ విరమణ చేసిన తర్వాత అప్పటివరకూ మన దగ్గర ఉన్న మూలధనంతో క్రమం తప్పకుండా ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. వాటిని కొద్దిగా సమీక్షించుకుందాం.

A-1. పెద్దల పొదుపు పథకం:

పోస్టాఫీసులో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వారు 'సీనియర్ సిటిజెన్ సేవింగ్స్ స్కీం' గా ప్రవేశపెట్టారు. ఒక వరిష్ట పౌరుడు తన పేరున కానీ, జీవితభాగస్వామి వయసుతో నిమిత్తం లేకుండా ఉమ్మడి ఖాతాను కనీసం రు. 1000 నుంచి 15 లక్షల వరకు ఈ ఖాతాలో జమచేసి 5 సంవత్సరాలు కాలపరిమితితో కొనసాగించాలి. ఈ సొమ్ముపై త్రైమాసిక వడ్డీ అనగా ఏప్రిల్. జూలై, అక్టోబరు, జనవరి నెలలో పని దినాన ఖాతాదారుని పొదుపు ఖాతాకు జమచేస్తారు. ఈ పథకంలో ప్రారంభంలో కానీ, మధ్యలో కానీ ఒకరిని నామినీగా పేరు మార్చుకోవచ్చు. ఉమ్మడి ఖాతాలో తొలి ఖాతాదారుడు గతిస్తే, రెండో ఖాతాదారు పథకాన్ని కొనసాగించవచ్చును. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సి ప్రకారం పన్ను మినహాయింపు వర్తిస్తుంది. వార్షిక వడ్డీ రు. 10 వేలు దాటినపుడు మూలం వద్ద పన్ను వసూలు చేస్తారు. 15 హెచ్ ఫారం సంవత్సర ప్రారంభంలో ఖాతాదారు సమర్పిస్తే పన్ను వసూలు చేయరు. డిపాజిట్టు రశీదును తనఖాగా చూపించి ఋణం తీసుకునే అవకాశం లేదు. ఈ పథకంలో ఎక్కువ లభిస్తుంది.

A-2. ఫింఛను (వయవందన) పథకం :

మార్చి 20 20 వరకు అందుబాటులో ఉండే ఈ పథకంలో 60 ఏళ్ళు పూర్తి అయిన భారతీయ పౌరులందరూ మదుపు చేయవచ్చును. ఏడాదికి 8 % కనీస ప్రతిఫలంతో 10 ఏళ్ల కాలపరిమితితో ఈ పథకం అందుబాటులో ఉంటుంది. 10 ఏళ్ల వ్యవధి ముగిశాక చివరి వాయిదా ఫింఛనుతో పాటు ప్రారంభంలో మదుపు చేసిన మొత్తాన్ని తిరిగిపొందవచ్చును. ఈ స్కీమ్లో రు.15 లక్షల వరకూ మదుపు చేయవచ్చును. గడువులోపల ఖాతాదారు మరణిస్తే నామినీకి డిపాజిట్టు సొమ్ము చెల్లిస్తారు. పథకంలో చేరిన 3 ఏళ్ల తర్వాత మదుపు చేసిన మొత్తంలో 75 శాతం ఋణం వైద్య ఖర్చుల నిమిత్తం పొందవచ్చును. పొందిన ఫింఛను ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తుంది.

A-3. సొంత ఇల్లుపై తనఖా ఋణం:

సొంత ఇల్లును కూడా ఫించను వచ్చే మార్గంగా మలుచుకు-

నే అవకాశం ఉంది. సాధారణంగా బ్యాంకులు మనకు ముందే ఋణం ఇస్తే వాయిదాలలో దాన్ని తీరుస్తాం. అలా కాకుండా బ్యాంకు మన ఇంటిని తాకట్టు పెట్టుకుని, నెలనెలా కొంత డబ్బు ఇస్తుంది. దీన్నే రివర్స్ మార్టిగేజ్ అంటారు. తనఖా పెట్టె ఇంటి విలువ మిగిలిన జీవితకాలాన్ని పరిగణలోనికి తీసుకుని రుణాన్ని మంజూరు చేస్తారు. ఋణగ్రహీత మరణించిన పిమ్మట వారసులు ఋణాన్ని చెల్లించి తనఖా ఆస్తిని పొందవచ్చు. ఆరోగ్యపు లేదా అత్యవసరపు ఖర్చుల కోసం ఫించను రూపంలో అదనపు ఆదాయాన్ని ఇవ్వడం కోసం ఈ ఋణాన్ని మంజూరు చేస్తారు. గరిష్టంగా రు.50 వేల దాకా మంజూరు చేస్తారు.

A-4. ఫించను పై ఋణం

పదవీ విరమణ పొంది ఫించను అందుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బ్యాంకులు సులభంగా ఋణాలు తీసుకునే అవకాశాలు కలుగజేస్తున్నాయి. వారి నిబంధనలు ఇలా ఉంటాయి.

- 75 సంవత్సరాలు పైబడినవారు మాత్రం ఋణ అర్హులు.
- ఈ ఋణాన్ని పొందుటకు జీవన భాగస్వామి లేదా ఇతర కుటుంబ సభ్యులు ఎవరైనా ఒక వ్యక్తీ హామీదారుగా ఉండాలి. ఫించను జమఅయ్యే బ్యాంకు శాఖలోనే ఈ ఋణాన్ని మంజూరు చేస్తారు.

B-1. ఆరోగ్య భీమా:

వరిష్ఠ పౌరుల కోసం నేషనల్ ఇన్సూరెన్స్ ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. కాస్త ప్రీమియం అధికంగా ఉన్నప్పటికీ ఏదైనా అనుకోని అనారోగ్యం బారిన పడితే లక్షల రూపాయల్లో ఖర్చు ఉంటుంది. ఆరోగ్యభీమా పాలసీని ఒక రక్షణ కవచంగా ఉంచుకోవడం.

ఈ మధ్యకాలంలో మన దేశ ప్రధాని ప్రవేశపెట్టిన భీమా పథకంలో ప్రతి భారతీయుడు రు. 1324 ఏడాదికి ప్రీమియం చెల్లించి 'ఆయుష్మాన్ భారత్' లో చేరి రు. అయిదు లక్షల వరకు ఇంటిల్లపాదికీ ఉచితంగా హాస్పిటల్ చికిత్స ఖర్చులకు పొందే సావకాశం. ది. 25-9-2018 నుంచి ప్రతి వారికీ లభిస్తుంది ఈ భీమా పాలసీ.

B-2. ఆరోగ్య సూత్రములు:

'ఆరోగ్యమే మహాభాగ్యం..' ముఖ్యంగా వరిష్ఠ పౌరులు అనేక ఆరోగ్యసూత్రాలు పాటించాలి. అనేక ఆరోగ్య సమస్యలకు మూలం మనం తీసుకునే ఆహారంలో లేవని మన జీవిత విధానం లో ఉన్నాయని, మనసు హాయిగా ఉంచుకున్నవారికి ఎ రోగాలూ రావని నిరూపించబడింది. ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లు అన్ని రకాల ఆహారాలను నిరభ్యంతరంగా తినమంటున్నారు. ఉపవాసాలు చేయమంటున్నారు. పొద్దున్నే లేచి, ఏ గుడికో, గోపురానికో వెళ్లి ఆలయం చుట్టూ వీలైనన్ని ఎక్కువ ప్రదక్షిణలు చేసి ప్రశాంతంగా ఉంటూ పాటలు వినమంటున్నారు. మనస్సు ప్రశాంతంగా ఉంచుకుంటే ఉన్న రోగాలు తగ్గుముఖం పట్టడమేకాక, కొత్త రోగాలు దరికి చేరవంటున్నారు. అధిక స్వార్థం, మొండితనం, అతి విచారం, అతి బద్ధకం వంటి అవలక్షణాల నుంచి దూరంగా ఉండమంటున్నారు. కారుణ్యం, స్నేహభావం, సేవాభావం, కృతజ్ఞత, హాస్యప్రియత్వం, సంతోషం, సానుకూల దృక్పథం పెంచుకోవాలంటున్నారు.

వైద్య నిపుణులు కొన్ని సూచనలు ఇస్తున్నారు. వాటిని పాటిస్తే సుఖజీవితాన్ని అనుభవించవచ్చును.

- నాకు వయసైపోయింది అని చింతించకండి. మీ మరణం మీ చేతుల్లో లేదు. సానుకూల దృక్పథంతో మనుగడ సాగించండి.
- మీవద్ద సొమ్ము, స్థిరాస్తులను వెంటనే పిల్లలకు ఇవ్వకండి. మీ ఖర్చులకు వాడుకునేలా ప్రాధాన్యత ఇవ్వండి.
- నలుగురితో కలవండి. సరదాగా గడపండి.
- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మీరూ మారండి.
- స్వార్థాన్ని విడనాడి, మానవతా

దృక్పథంతో మంచి పనులకు నాంది పలకండి.
- మరణం వస్తుందని భయపడి విచారంలో మునగకండి. ఎవరైనా ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదు.
- శతృత్వాన్ని వీడండి. పగ, ద్వేషాలు వదిలి అందరినీ మీ కుటుంబంగా భావించండి.
- మీరు బాధ్యతగా చేయవలసిన పనులు, సమయపాలనతో పూర్తి చేసుకోండి.

సుదీర్ఘ జీవన ప్రయాణంలో అందరూ సమానమే

* నలభై ఏళ్ల వయసులో:
ఉన్నత విద్యావంతులు - సాధారణ విద్యావంతులు - ఇద్దరూ సమానమే. సంపాదనలో ఎదుగుదలనే సమాజం గుర్తిస్తుంది.
* ఏభై ఏళ్ల వయసులో:
అందమైన దేహం- అందవిహీనం మధ్య తేడా చాలా స్వల్పం. శరీరం మీద మచ్చలు, ముడతలు దాచిపెట్టలేం. ఇప్పటివరకు అందం తో వచ్చిన గౌరవాన్ని కాపాడుకోవటానికి తంటాలెన్నో పడాల్సివస్తుంది.
*అరవై ఏళ్ల వయసులో:
ఉన్నత శ్రేణి జీవితం - సాధారణ జీవనం - రెండూ ఒకటే - పదవీ విరమణ తర్వాత బంట్రోతు కూడా పలకరించకపోవచ్చు.
* డెబ్బై ఏళ్ల వయసులో:
విశాల భవంతి - సాధారణ జీవితం - రెండూ ఒకటే - కీళ్ళ నెప్పులతో కదలలేని స్థితి - సేద తీరటానికి ఓ మూలన చిన్న స్థలం చాలు.
* ఎనభై ఏళ్ల వయసులో:
ధనం ఉన్నా లేకపోయినా ఫర్వాలేదు. ఎంత డబ్బున్నా - స్వంతంగా ఎక్కడా ఏమీ ఖర్చు పెట్టలేం.
* తొంభై ఏళ్ల వయసులో:
నిద్ర - మెలుకువ రెండూ ఒకటే. సూర్యోదయం - సూర్యాస్తమయం - రెంటినీ లెక్కించడం తప్ప ఏం చేయాలో కూడా తెలియదు.

అందంతో వచ్చే మిడిసిపాటు
ఆస్తులతో వచ్చే అహంకారం
విద్యాధికతతో గౌరవాన్ని ఆశించడం
కాలగమనంలో మన కళ్ళముందే కనుమరుగయ్యే సత్యాలు

సుదీర్ఘ జీవన ప్రయాణంలో అందరూ సమానమే.
అందుకే ఒత్తిడులకు దూరంగా ఉంటూ
అనుబంధాలను పదిలపరచుకుంటూ
జీవనంలోని మాధుర్యాలను ఆస్వాదిద్దాం.

పమ్మి భారతీ శర్మ

మా బొమ్మల పెళ్లి

వీడియోకై కింద క్లిక్ చేయండి

చిన్నతనం ఆటలు ఆ రోజులకి. జ్ఞాపకాలకి మాత్రమే పరిమితం కాకూడదని మా కాలనీ ఆడవాళ్ళు అందరం కలసి పిల్లల శెలవు రోజున బొమ్మల పెళ్లి చేసాం. మారుతున్న అభిరుచులు, ఆటలు, ఆడంబరాల మధ్య చిన్నతనపు మన ఉనికిని మన సాంప్రదాయ ఆటల్ని గుర్తు చేసుకుంటూ, ఫోన్లలో, గాజెట్ (Gadjet) ల మధ్య నలుగుతున్న వారి పసితనానికి ఈ బొమ్మల పెళ్లి పరిచయం చెయ్యాలనే ఉద్దేశ్యం. అందరం చాలా ఉత్సాహంగా వారి వారి పసితనపు ఆటల్ని బాల్యాన్ని గుర్తు చేసుకుని.... ఒక స్నేహితురాలి సెల్లార్ లో ఒక స్టేజ్ కట్టుకుని ముందు రోజు సాయంత్రం దానిపై తివాచిని పరిచి... చుట్టూ బంతిపూల మాలలు కట్టి మండపాన్ని ఏర్పరచుకున్నాము. చుట్టూ పరదాలు కట్టుకుని... కుర్చీలు ఏర్పాటు చేసుకున్నాము. చందనం బొమ్మలకు బట్టలు కుట్టించి, పూసలు, రాళ్ళు అతికించి అలంకరణ చేశాము. అందరం గోరింటాకులు పెట్టుకున్నాము. మాలో బొమ్మలు గీయడం బాగా తెలిసిన ఒకామె శుభలేఖలు తయారు చేశారు. పెళ్ళికి వాడే తెరచెల్లాపై చమ్కీలు కుట్టారు. మరమరాలతో దండలు... ఇలా అందరం చాలా బాగా తలో ఒక పనీ చేస్తూ ఎంతో ఆనందంగా గడిపాము. మొత్తం 50 మంది ఆడవాళ్ళం పెళ్లిరోజు సమావేశయ్యాము. సగం ఆడపెళ్ళివారు... మిగిలినవారు మగ పెళ్ళివారు. ముందు రెండు రోజులుగా... బుజబుజరేకుల పిల్ల ఉందా? అంటూ చిన్నతనపు పాటలు ప్రాక్టీస్ చేశాము. విడిదిలో వియ్యాలవారి పాటలు వియ్యపురాలిని ఆటపట్టిస్తూ పాడే పాటలు, పెళ్లిపాటలు అందరం గుర్తు చేసుకుని ప్రాక్టీసు చేశాము. పిల్లల్ని చక్కగా ముస్తాబు చేశాం. మా సంబరం చూసి వారంతా తెగ ఆశ్చర్యపోయారు.

పులిహోర, బూరెలతో సహా చక్కని భోజనం పురమాయించుకున్నాము. పూర్తిగా పెళ్లితంతులన్నీ చేశాము. ఆఖరున అత్తవారింటికి పిల్లకి వడిబియ్యం, చలిమిడి కూడా పెట్టి కన్నీళ్ళతో మగపెళ్లివారికి అప్పగించాము.

(40 వ పేజీ చూడండి)

శ్రీనాధుని కాశీ ఖండం

(వచనానుసరణం)

పోచినపెద్ది మురళీ కృష్ణ

ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రథమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.

(గత సంచిక తరువాయి)

అల్లుడు తనయందు ఉదాశీనంగా ప్రవర్తించినందుకు దక్ష ప్రజాపతి బాధతో ఇంటికి చేరుకున్నాడు. కాటిలో ఉన్నవాడి ని గృహస్తునిగా ఎట్లు పరిగణిస్తాము? బ్రహ్మాది దేవతలను సంహరించిన పాతకి. బిడ్డను ఇచ్చిన మామగారు గురుస్థానీయుడు. అటువంటి నన్ను ప్రీతి వచనాలతో గౌరవించవలదా?

తల్లిదండ్రులు లేనివానికి బిడ్డను ఇచ్చుట నాదే తప్పు. పేదవారికి వృధాభిమానము, అహంకారము సహజము. అల్లుడైనవారికి ఇది సహజ లక్షణము. అంతరాలు తెలియకపోవుట కులహీనుల లక్షణము. తల్లిదండ్రులు లేనివారికి, ముష్టిఎత్తుకొని బ్రతుకు వారికి ఇది సహజ ధర్మము. మామనను గౌరవము లేకుండగా నన్ను దేవతా సమూహము మధ్యలో అవమాన పరిచాడో అదేవిధముగా నేను ఒక యజ్ఞము తలపెట్టి అల్లుడను గౌరవము లేకుండగా అవమానపరుస్తాను",అని దక్షుడు తలంచి ఒక యజ్ఞాన్ని ప్రారంభించాడు.

దక్షుడు యజ్ఞం చేయడానికి ప్రారంభించాడు. శ్రీ మహావిష్ణువును పర్యవేక్షకునిగాను, మరీచి, అత్రి, భరద్వాజుని, సప్తర్షులను, ఋత్విజులుగా ను, ముల్లోకాలను దక్షిణ ద్రవ్యములుగాను, భృగు మహర్షిని బ్రహ్మగాను, అంగరసుని ఆచార్యునిగాను, భగుని పూషుని సదస్యులుగాను, దిక్పాలకులను రక్షకులుగాను, అల్లుళ్ళైన ధర్ముడు, చంద్రుడు, కశ్యపులను సహాయకులుగాను నియమించాడు. కామధేనువు హవిర్ద్రవ్యములను, కల్పవృక్షం సమిధలను కుశలను, సమకూర్చాయి. విశ్వకర్మ దారు, పాత్ర, శకట, మంటపాలను, అలంకారాలను సమకూర్చాడు. భార్య

అయిన శతరూపతోకలసి దక్షుడు ముత్యాలగద్దెనెక్కి కొలువుతీర్చి ఉన్నాడు. దేవతలు, మునులు, ఆయనను పరివేష్టించి ఉన్నారు. సభంతా నిశ్శబ్దంగా ఉంది. ఆసమయంలో దధీచి సభలోనివారందరు వినునట్లుగా

"ఓ దక్షప్రజాపతీ! ఈ సభలో సరస్వతీ దేవి స్తుతిప్రబంధాలను చదువుతోంది, ఆచార్యస్తానంలో బృహస్పతి సిద్ధంగా ఉన్నాడు. భ్రుగుమహర్షి బ్రహ్మత్వాన్నిస్వీకరించి ఉన్నాడు. లక్ష్మీదేవి అంతఃపుర స్త్రీలను అలంకరిస్తోంది. శతరూప తన కొప్పుపై ముత్యాల జాళిని అలంకరించుకొంది. నీవు యజ్ఞ దీక్షను స్వీకరించుకొని ఉన్నావు. ఇన్ని ఏర్పాటులు చేసినా పరమేశ్వరుని తీసుకొని రాకపోవడం ఈ యజ్ఞానికి లోటుగా ఉంది" అని పలికాడు. పరమేశ్వరుని పిలవకుండా శ్రీహరి ఉపద్రష్టగా ఉండుట సమంజసమా? ఓ దక్షప్రజాపతీ! శివునికి వామాంగము విష్ణువని, దక్షిణ భాగము బ్రహ్మ అని నీకు తెలియదా? అటువంటి పరమేశ్వరుని యజ్ఞానికి పిలవనక్కరలేదా? ఈ కుబేరుడు శివునికి స్నేహితుడు కాదా? ఈ అగ్నిహోతృడు పరమరమేశ్వరుని మూడవ కన్ను కాదా? ఈ ఇంద్రుడు గంగాధరుని దాసుడు కాడా ? వీరందరు శివుని వెలివేసి ఈ యజ్ఞానికి ఏం తినాలని వచ్చారు? శివుడు కన్ను తెరిస్తే వీరి భార్యల మంగళ సూత్రాలు తెగిపోవా? శివుడులేని యజ్ఞానికి యముడు ఎందుకు వచ్చాడు? పరమేశ్వరుని ఎడమకాలి తన్ను మరచి పోయాడా? భోక్త శివుడు, భోగ్యము శివుడు, ప్రేరకుడు శివుడు అని శ్వేతాశ్వతరోపనిషత్తు చెప్పిన విషయం వినలేదా? ఆకాశంమొదలు పరమాణువు వరకు చరాచర ప్రపంచానికి, సృష్టి స్తితి లయములకు కారణభూతుడైన శంభుడు నీకు ఎందుకు పూజనీయుడు కాదు? నీమేలుకోరిన వాడను, బ్రాహ్మణుడను, ధర్మజ్ఞుడను, అయిన నామాటను విను. యజ్ఞఫల విధాత, భువనరక్షణధురీణుడు, భోగికంకణుడు అయిన పరమేశ్వరుని యజ్ఞానికి పిలు. అర్ధంలేని వాక్యం, వేదోక్త కర్మాచరణం లేని శరీరం, భర్త లేని స్త్రీ, గంగానది లేని దేశం, పుత్రహీనమైన దాంపత్యము, దానం చేయని సంపద, విద్యలేని అలంకారము, భార్యలేని సౌఖ్యము, దర్భలు లేని సంధ్యావందనం, తిలలు లేని పితృతర్పణం, హవిస్సు లేని హోమము, శివుడు లేని క్రతువు నిష్ఫలము" అని ధధీచి పలికాడు.

ఆ మాటలు వినగానే దక్షుడు కోపంతో దధీచిని ప్రాగ్వంశమునుండి త్రోసివేయమని ఆజ్ఞాపించాడు. దధీచి ఆప్రాంతంనుండి నిరంకుశ వైఖరితో వెళ్ళిపోయాడు. అతని వెంట దుర్వాసుడు, ఉదంకుడు, పమన్యుడు, రుచికుడు,గాలవుడు, మాండవ్యుడు, వామదేవుడు, ఉద్దాలకుడు, దధీచి వెళ్ళిపోయారు. బ్రహ్మ సత్య లోకానికి వెళ్ళిపోయాడు. దక్షుడు యజ్ఞాన్ని ప్రారంభించాడు. ఈవృత్తాంతాన్ని నారదునిద్వారా సతీదేవి తెలుసుకుని పరమేశ్వరుని అనుమతి తీసుకొని తండ్రికి బుద్ధి చెప్పడానికి రథాన్ని ఎక్కి కైలాసంనుండి వచ్చింది.

(ఇంకా వుంది)

తుమ్మూరి రాంమోహన్ రావు

తెలంగాణా మహానుభావులు

3. కలం యోధుడు కాళోజీ

'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక' అన్నఆంగ్ల కవి బైరన్ అనువాద వాక్యం ఆయనను తలచు-కోగానే మొదట స్ఫురిస్తుంది.



చావ చింపు సామ్రాజ్యం
చాకివాడ శాసన సభ
మూత్రశాల యాత్రాస్థలి
ఎచటైతేం ఏదైతేం
పోటీపడి కాటులాడ

కోడిగుడ్డు కోహినూరు
పాటిమన్ను ప్లాటీనం
ఏదైతేం ఏదైతేం
పోటీపడి కాటులాడ

అడవి మనిషి ఆచార్యుడు
పసిబాలుడు పండు ముసలి
బిచ్చగాడు లచ్చిమొగడు
ఎవడైతేం ఎవడైతేం
పోటీ పడి కాటులాడ

ఇవి నా పది పదకొండు సంవత్స-రాల వయస్సులో మా బాపు ఏదో పుస్తకంలో చదువుతుంటే విన్న మాటలు.కాళోజీ నారాయణ రావు అనే పేరు అప్పుడు విన్నా ఆయన గురించి అర్థమయే వయసు కా-కపోయినా ఆ వాక్యాలు మాత్రం బలంగా నాటుకుపొయ్యాయి.

మా సదాశివ సారు ఎప్పుడు ముచ్చట చెప్పినా కాళోజీ సోదరుల ప్రస్తావన ఉండేది.పె-ద్దాయన కాళోజీ రామేశ్వరరావు,-చిన్నాయన నారాయణ రావు.

ఇద్దరూ మంచి కవులే.రామేశ్వ-రరావు 'షాద్'అన్న కలంపేరుతో రచనలు చేసేవారు ఉరుదూలో. తెలుగులో కూడా కవిత్వం రాసే వారు.సాహితీ మిత్రమండ-లి తరఫున హనుమకొండ-లో తరచుగా కవి సమ్మేళనాలు జరిగేవి.వారి ఆతిథ్యం,అనురా-

గం గురించి చెబుతూ తన్మయులయ్యేవారు సదాశివగారు.

నేను హనుమకొండలో బి.ఎడ్ చేసినప్పుడు రామేశ్వర్ రావుగారి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. నేనూ పాల్గొని నా కవిత

ఎందుకీ స్వాతంత్ర్య దివసం
ఎందుకీ గణతంత్ర్ర దివసం
ఎందుకెందుకు జరుపుటెందుకు
ప్రజాస్వామ్యపు అరుపులెందుకు



అని ఆవేశంగా చదివితే ఆయన అభినందన దృక్కులతో ఆశీర్వదించిన దృశ్యం మరచిపోలేనిది. తరువాత కొన్ని నాళ్లకు మిత్రులు నారాయణగౌడు,రహీం,సత్యనారాయణరెడ్డి లతో హనుమకొండలో జరిగిన ఒక సారస్వత సభకు వెళ్లినపుడు కాళోజీ నారాయణ రావుగారిని చూడటానికి వారింటికి వెళ్లాం.ఆరోజు ఆయనకు నూటా మూడు డిగ్రీల జ్వరం.మాకు తెలియదు ఇంటికి వెళ్లేదాకా.తిరిగి వద్దామనుకుంటే ఇంటి వాళ్లు ఫరవాలేదు మాట్లాడి వెళ్లండి అన్నారు.ముందుగదిలో పొడవైన బల్ల మీద పడుకొని ఉన్న ఆయన్ను చూడగానే అంపశయ్యమీది భీష్ముడు గుర్తుకు వచ్చాడు.దబ్బపండు వంటి శరీరం,నీలిరంగు కలిసిన లేతాకు పచ్చ కళ్లు, ఆజానుబాహువు ఆయనే తెలంగాణా ప్రజాకవి,- కవిత్వాన్ని ప్రజల క్షేమం కోసం ప్రభుత్వాన్ని ఎదిరించడంకోసం ఆయుధంగా వాడుకున్న పోరాట యోధుడు.ఆయన గొడవంతా పీడిత తాడిత అమాయక ప్రజల గొడవే.

మనకొంపలార్చిన మన స్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచిపోకుండగ గురుతుంచుకోవాలె
కసి ఆరి పోకుండ బుసకొట్టుతుండాలె
కాలంబు రాగానె కాటేసితీరాలె

చెప్పదలచుకున్న విషయాన్ని ముక్కుసూటిగా,నిర్భయంగా సులభమైన వాడి పదాలతో చెప్పటం అనితర సాధ్యం.గుండెనిండా వెత ఉన్నవారికే అలవోకగా అశువుగా కవిత నోటినుండి వెడలుతుంది.

మనిషికి అచ్చమైన నిర్వచనం కాళోజీ.కాళోజీ అసలుపేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రాంరాజా కాళే. కాళే గౌరవవాచకం జీ తో కలిసి కాళేజీ, కాళోజీ అయ్యింది. తండ్రి రంగారావు మహరాష్ట్రీయుడు,తల్లి రమాబాయి కన్నడిగురాలు.కాళోజీ కర్ణాటక రాష్ట్రం బీజాపూరు జిల్లా రట్టహళి గ్రామంలో మాతామహుల ఇంట 9 సెప్టెంబరు 1914 న ద్వితీయ సంతానంగా జన్మించాడు.రామేశ్వర్ రావు ఈయనకంటే ఆరేండ్లు పెద్ద. ఉద్యోగరీత్యా కుటుంబం తెలంగాణాకు వలసవచ్చి వరంగల్ సమీపంలోని మడికొండలో స్థిర-

నివాసమేర్పరచుకున్నారు.

కాళోజీ బాల్యం మడికొండలో గడిచింది.అక్కడే పల్లాదుర్గయ్య,బిరుదురాజు రామరాజు,వానమామలై సోదరులతో మైత్రీ బంధం ఏర్పడింది.కాళోజీ పాఠశాల చదువు హనుమకొండలో,కళాశాల చదువు హైదరాబాదు చౌమహల్లో జరిగింది.ఆ తరవాత హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయకళాశాలలో లా చదివారు.

ఆయనలోని అభ్యుదయ భావాలు ఆయనను ఆర్జన లభించే న్యాయయవాదవృత్తి వైపు కాకుండా ఉద్యమాలవైపులాగాయి.కాళోజీ జీవితమంతా తెలంగాణా రాజకీయ,సాహిత్య,-సాంస్కృతిక,సామాజిక ఉద్యమాలతో ముడివడి ఉంది.

అవనిపై జరిగేటి అవకతవకలు
జూచి
ఎందుకో నాహృదిని ఇన్ని
ఆవేదనలు
పతితమానవు జూచి చితికి-
పోవును మనసు

అని చెప్పుకున్నాడు ఆయన నాగొడవలో.

ఎందుకంటే కాళోజీ కవిత్వమూ బతుకూ వేరు వేరు కావు.

ప్రజాస్వామ్యం మీద ప్రగాఢ విశ్వాసం కలిగి ఉన్న కాళోజీ ప్రహ్లాదుడు మొట్టమొదటి సత్యాగ్రహి అనీ,హిరణ్యకశిపుడు తొలి ఫాసిస్టు అనీ అంటారు.

హిరణ్యకశిపుని సంహరించిన నరసింహునిది ప్రతిహింస అనీ ఆయన పలు ప్రసంగాలలో ఉదాహరణగ చెప్పేవారు. ఈయన పై మహారాష్ట్ర లోని సంత్ ,ఇస్లాంలోని సూఫీ సంప్రదాయాల ప్రభావం కూడా ఉన్నది. ఖలీల్ జిబ్రాన్ ప్రొఫెట్ లో ఆల్ ముస్తఫాను తానుండిన కాలానికి తానే ఉషస్సయినవాడు అంటారాయన.

1969 తెలంగాణా అంతటా తిరిగారాయన.మొన్నటి తెలంగాణా ఉద్యమంలో ఆయన పేరెత్తని సభలేదంటే అతిశయోక్తి కాదు. భాషవిషయంలో కాళోజీ నిర్దిష్టమైన అభిప్రాయం ఉండేది.ఎవరి భాష,యాస వారికే గొప్ప,ఒకరి భాషను ఒకరు ఎగతాళి చేయవద్దని నొక్కి చెప్పిన వారు కాళోజీ.

బడి పలుకుల భాష కాకుండా.పలుకుబళ్ల భాష గావాలె అన్న భాషా ప్రేమికుడు.

హైదరాబాదు పబ్లిక్ గార్డెన్ ఇందిరా ప్రియదర్శిని హాల్లో కాళోజీ అమృతోత్సవం జరిగింది. దానికి అధ్యక్షులు సామల సదాశివ,ముఖ్య అతిథి ఆనాటి ప్రధానమంత్రి కాళన్న అని పిలిచే సన్నిహితుడు పి.వి.నరసింహారావు గారు,మరల 13 నవంబరు 2002 ఆయన పరమదించిన తరువాత సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పరచిన సంతాప సభలో కూడా వీరే ఇరువురు సభాధ్యక్ష ముఖ్య అతిథులు.ఆ రెండు సభలకూ హాజరైన నాకు కాళోజీ ప్రత్యక్షంలో,పరోక్షంలో వారిరువురి ఆత్మీయ స్పందన కాళోజీ ఎంత ఉన్నతమైన వ్యక్తిత్వం గల మనిషో తెలియజెప్పింది.

కాళోజీ రచనల్లో 'నా గొడవ' చాలా పేరు తెచ్చుకున్నది. పరాభవ వసంతం,పరాభవ గ్రీష్మం,పరాభవ వర్షం,పరాభవ శరత్తు,పరాభవహేమంతం,పరాభవ శిశిరం మిత్రమండలి ప్రచురించింది.ఈయన ఇతర రచనలు తెలంగాణా ఉద్యమ కవితలు. కాళోజీ కథానికలు,ఖలీల్ జిబ్రాన్ ద ప్రొఫెట్ అనువాదం జీవనగీత ముద్రితాలు.ఇంకా ఆయన పలు అనువాదాలు,వ్యాసాలు అముద్రితంగా ఉన్నవి.

9 సెప్టెంబరు తెలంగాణా భాషా దినోత్సవంగా ప్రకటించడం,ప్రతి ఏటా ఆయన పేర అవార్డు ప్రకటించడం తెలంగాణా ప్రభుత్వం ఆయన గౌరవం చాటేదిగా ఉంది.

సాగిపోవుటె బతుకు - ఆగి-
పోవుటె చావు
బ్రతుకు పోరాటము- పడకు
ఆరాటము అనే కాళోజీ

నిత్యపథికుడు,నిత్యాన్వేషి.

పుటుక నీది -
చావునీది-
బతుకంతా దేశానిది

అని కాళోజీ, లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ గురించి రాసిన మాటలు ఆయనకూ వర్తిస్తాయి.

చిలకమర్తి దుర్గా ప్రసాదరావు

SPOKEN SANSKRIT

+91 9897959425

(సంభాషణ సంస్కృతం -22)

Unit -!

प्रथमाविभक्तिः (Prathamaa vibhakti)

సాధారణంగా ప్రతి వాక్యంలోనూ కర్త , కర్మ ,క్రియ అనే మూడు అంశాలుంటాయి . మిగిలినపదాలన్ని కర్తకు గాని , కర్మకు గాని , క్రియకు గాని విశేషణాలుగా అన్వయిస్తూ ఉంటాయి . ఇక క్రియా పదంతో అన్వ-యాన్ని పొందే వాటిని కారకములు అంటారు.

ప్రథమా, ద్వితీయా, తృతీయా, చతుర్థీ, పంచమీ, సప్తమీవిభక్తులు క్రియతో అనేక రకాలుగా అన్వయి-స్తాయి. క్రియాన్వయత్వం కారకత్వం అనే నియమం ప్రకారం క్రియా పదంతో అన్వయిస్తేనే అది కారకం అవుతుంది షష్ఠీవిభక్తి సంబంధాన్ని మాత్రమె సూచిస్తుంది . దానికి కారకత్వం లేదు కర్తృకారకంలో ప్రథమా, కర్మకారకంలో ద్వితీయా , కరణ కారకంలో తృతీయ , సంప్రదాన కారకంలో చతుర్థీ , అపాదాన కారకంలో పంచమీ , అధికరణకారకంలో సప్తమీ విభక్తులు వస్తాయి . ఏడూ విభక్తులు ఏడూ విధాలైన సంబంధాల్ని వ్యక్తం చేస్తాయి . అవన్నీ క్రమంగా తెలుసుకుందాం .

ముందుగా ప్రథమా విభక్తి గురించి తెలుసుకుందాం .

Normally every sentence has three main components Subject, Object and Verb.

All the words get connected with the verb in different ways. The relation of them with the verb can be classified as kartru karaka , karma karaka karaNa karaka , saMpradaana karaka , apaadaana karaka and adhikarana karaka .

Seven cases: and karakas

1. प्रथमा विभक्तिः --Nominative case is used in kartru karaka
2. द्वितीया विभक्तिः Accusitive case is used in karma karaka
3 तृतीया विभक्तिः Instrumental case is used in Karanakaraka
4. चतुर्थी विभक्तिः Dative case is used in sampradaana karaka
5. पञ्चमी विभक्तिः Ablative case is used in Apaadaana karaka
6. षष्ठी विभक्तिः Genetive case is used to express any kind of Sambandha
7. सप्तमी विभक्तिः Locative case is used in Adhikaranakaraka.

Normally every sentence has three main components, Subject, Object and Verb. All the other words are connected in different ways with verb.

1.The subject (karta) is always expressed by प्रथमा (Nominative case)

2 The object (karma) is expressed by द्वितीया Accusative case etc

There are seven cases and they are used to express different relations with the verb.

प्रथमाविभक्ति:

प्रातिपदिकार्थ- लिङ्ग- परिमाण -वचनमात्रे प्रथमा

కేవలం ప్రతిపదికార్థము నందు , లింగ మాత్రమునందు , పరిమాణ మాత్రమునందు , వచన మాత్రమునందు ప్రథమా విభక్తి వచ్చును .

Prathanma Vibhakti should be employed only in the sense of the base word, or when only gender, or measure or number is to be conveyed in addition to pratipadika.

1. प्रातिपदिकार्थ –नियतोपस्थितिक: प्रातिपदिकार्थ:

ఒక పదం ఉచ్చరించిన వెంటనే ఏ అర్థము స్ఫురణకు వచ్చునో అది ప్రాతిపదికార్థము .

2. लिङ्ग---उच्चै:-निचै:-कृष्ण: -श्री: --ज्ञानम्

3. परिमाणमात्रेप्रथमा –द्रोणो व्रीहि: (కుంచెడు ధాన్యం)

वचन—मात्रे प्रथमा – वचनं संख्या –एक:-द्वौ-बहव:

II. संबोधने च-हे राम!

Prathama should be employed when one is addressed or called.

II. द्वितीया विभक्ति:

कर्मणि द्वितीया

ద్వితీయా విభక్తి కర్మను సూచించును . ధాత్వర్థ ఫలాశ్రయము కర్మ . కర్త ఒక పని ద్వారా దేన్ని పొందదలచుకున్నాడో అది కర్మ అనబడుతుంది . కర్త ఒక పనిచేస్తాడు. ఆపని ద్వారా ఎదో ఒక ఫలాన్ని పొందాలనుకుంటాడు. ఆ ఫలం దేన్ని ఆశ్రయించుకుని ఉంటుందో అది కర్మ అవుతుంది.

వంటవాడు వంట వండుచున్నాడు .

ఇక్కడ వండుట అనే పని జరిగింది . ఆ పని వంటవాణ్ణి ఆశ్ర యించుకుని ఉంది. కాబట్టి ఆతను కర్త అవుతాడు. ఇక ఉడుకుట అనే పని జరిగింది దానికి ఆశ్రయం బియ్యం. అది కర్మ.

ధాతువు యొక్క అర్థం, దానికి సంబంధించిన వ్యాపారం (కార్యకలాపం) ఎవర్ని ఆధారం చేసుకుని ఉంటుందో అతడు కర్త. ధాత్వర్థఫలాశ్రయం కర్మ .

అన్నం ఉడకడం అనే పని జరిగింది అది అన్నాన్ని ఆశ్రయించుకుని ఉంది కాబట్టి అది కర్మ .

1. कर्तुरीप्सिततमं कर्म

When karma is not denoted by any thing else the accusative affix should be attached to the pratipadika .

1. कर्तुरीप्सिततमं कर्म

द्वितीया विभक्ति: (कर्मणि द्वितीया)

कर्तु: ईप्सिततमं कर्म

कर्तु: किम्? द्वितीया विभक्ति: (कर्मणि द्वितीया)
परित: योगे
विद्यालयं परित: छात्रा: क्रीडन्ति
सर्वनाम शब्दानां द्वितीयाविभक्ति:

प्रथमा --- द्वितीया

स:(he)- అతడు तौ(they) వారిద్దరు – ते (they) --- వారందరు
तम्(him)- అతనిని तौ(them)-వారిద్దరిని तान् (them) వారందరిని
एष:- ఇతడు एतौ—వీరిద్దరు एते --- వీరందరు
एतं ఇతనిని एतौ—వీరిద్దరిని एतान् వీరందరిని
सा (she) ఆమె – ते (they two)- వారిద్దరు ता:(they all) ---వారందరు
ताम् (her) – ఆమెను ते(them)—వారిద్దరిని ता(them) వారందరిని
एषा – ఈమె एते – వీరిద్దరు एता: వీరందరు -
एतां ఈమెను – एते వీరిద్దరిని –एता: వీరందరిని
तत् (that)-అది ते (those two)ఆ రెండు - तानि (all those) --అవి అన్ని
तत् ते तानि
एतत् (this) – एते (these two) एतानि (all those)

Parita: yoge
పరిత: యోగే ద్వితీయా
పరిత: అనే పదం ఉన్నప్పుడు ద్వితీయా విభక్తి వచ్చును
గ్రామం పరిత: వృక్షా: సంతి .

आदाय मांसमखिलं स्तनवर्जमङ्गान्
मां मुञ्च वागुरिक ! यामि कुरु प्रसादम्
सीदन्ति शष्पकबलग्रहणानभिज्ञा :
मन्मार्गवीक्षणरता: शिशवो मदीया:

Once, a cruel hunter shot an arrow against a deer and the arrow struck in to the throat of the deer. The hunter was approaching the deer to take away home. Mean while the deer recollected the condition of its poor kids. Here, please find the mental agony of the poor animal which made a pitiable request to the hunter to spare him.

Oh! My dear hunter! You cut and take away every part of my body. But spare my udder, because my newly born babies being unable to eat even tender grass must be waiting anxiously for me staring at the direction of which I have come. If I don't feed them they will die. Please be kind enough to leave me or at least to spare my udder.

Be kind towards all living beings. Let not all animals be killed

ఛందస్సులో గణితం

జి. కె. అనంత సురేశ్

ఛందస్సు ఒక మహాసముద్రము. గణితం సముద్రం లోంచి ఉద్భవించిన అపురూపమైన వస్తువులతో సమానము. కనుక, ఛందస్సులో ఇమిడివున్న గణితాన్ని వెలికితీసే ప్రయత్నం సాగరమథనమే! అయితే, ఛందస్సు వల్లే కొన్ని అద్భుతమైన గణిత అంశాలు కనుగొనబడ్డాయన్న విషయం గమనార్హం. ఇది ప్రాచీన భరతఖండంలోనే జరిగిందనేది చాలామందికి తెలియక పోవచ్చు. ఒకింత ఛందస్సు, ఇసుమంత గణితం చర్చించటం ద్వారా మనం ఛందస్సు లోని ప్రక్రియలు సంయోగ శాస్త్రము (combinatorics), దోష-సవరణ (error-correction) లాంటి కొత్త గణిత అంశాలకు ఎలా దారి తీయగలిగాయో అర్థం చేసుకోవచ్చు.

ఛందస్సు అంటే ఏమిటి? పద్య లక్షణాలను విశదీకరించేది. పద్య రచనలో పాటించాల్సిన నియమాలను తెలిపేది. గణ, యతి, ప్రాసలు ఛందస్సుకు మూలాధారాలు. యతి, ప్రాస నియమాలు పెక్కులు. వాటిని కేవలం నిర్వచించి, గణాలకు సంబంధించిన వివరణలతోనే ఈ వ్యాసం కొనసాగుతుంది. పద్యంలోని పంక్తులను పాదాలు అంటాం. పద్యపాదంలోని మొదటి అక్షరాన్ని యతి అంటారు. రెండో అక్షరం ప్రాస. పద్యానికి ఇంపుసొంపులను ఒనగడంలో యతి, ప్రాసలు దోహదం చేస్తాయి.

గణం అంటే సమూహం. అది అక్షర సమూహం కావొచ్చు, మాత్రల సమూహం కావొచ్చు. ఇక్కడ "మాత్ర" అంటే ఒక చిన్న కాల కొలమానం అనుకోవాలి. అది ఒక క్షణం కావొచ్చు, క్షణంలో నాలుగోవంతు కావొచ్చు. ఒక అక్షరాన్ని ఉచ్చరించేందుకు పట్టే కాలం మాత్ర. ఏక కాలపు మాత్ర లఘువు (అంగ్లంలో షార్ట్ సిలబుల్); ద్వికాలపు మాత్ర గురువు (లాంగ్ సిలబుల్). త్రికాలపు మాత్ర ప్లుతము. పొల్లు హల్లుకు (క్, న్, మొదలగునవి) అర్థమాత్ర చాలు. ఇలా మాత్రలు పలు రకాలు. హస్వాక్షరాలన్నీలఘువులు. అవి దీర్ఘం లేని అచ్చులు (అ, ఇ, ...) కావొచ్చు, హల్లులు (క, ఖ, గ, ...) కావొచ్చు, ద్విత్వాక్షరాలు (క్క, త్త, న్న, ...) కావొచ్చు, లేదా సంయుక్తాక్షరాలు (క్ర, న్య, ...) కావొచ్చు. అరసున్న కలిగిన అక్షరాలు కూడా లఘువులే. అంటే, ఈ అక్షరాలను ఉచ్చరించేందుకు ఏక మాత్ర కాలం చాలు. దీర్ఘాక్షరాలు గురువులు. పూర్ణ బిందువు, విసర్గ, మరియు పొల్లు హల్లులతో కూడిన అక్షరాలు కూడా గురువులు. గురువులను ఉచ్చరించేందుకు రెండు మాత్రల కాలం కావాలి. కాకపోతే, చిన్న మలుపు: ద్విత్వాక్షరానికి కానీ సంయుక్తాక్షరానికి కానీ ముందున్న అక్షరం, హ్రస్వమైనా అది గురువుగానే పరిగణించబడుతుంది. "ర" కారానికి ఇది వర్తించదు. కొన్ని ఉదాహరణలు తీసుకొందాం.

"ఛందస్సు" అనే పదంలో మూడు అక్షరాలున్నాయి. పూర్ణ బిందువు కలిగివుంది కనుక "ఛం" గురువు. "స్సు" కి ముందున్నది కనుక, "ద" గురువు.

"స్సు" హ్రస్వం కనుక లఘువు. వెరసి, "ఛందస్సు" లో గురువు-గురువు-లఘువు ఉన్నాయన్న మాట. లఘువుని "I" తో, గురువుని "U" తో సూచిస్తారు. కనుక, "ఛందస్సు"ని UUI గా సూచిస్తాం.

"కార్యక్రమం" నాల్గక్షరాల పదం. గురులఘువుల పద్ధతిలో ఇది UIIU.

అలాగే "సిరి వెన్నెల"ని II UII గా, "సీతారామ శాస్త్రి"ని UUUI UI గా వ్రాస్తాం. "ఉప్పుకప్పురంబు" లోనూ, "మేడిపండు చూడ"లోనూ UIUIUI ఉన్నాయి. ఈ గురు-లఘువుల లెక్కల్లో, గణితం సహజంగా వచ్చేస్తుంది. అదెలాగో చూద్దాం.

పద్యాలన్నింటికీ ఒక నిర్దిష్టమైన లయ, అంటే తాళం, ఉంటుంది. ప్రతి పద్య పాదం (పంక్తి) సమానమైన అక్షరాలనో లేక మాత్రలనో కలిగి ఉంటుంది. పద్యం వ్రాసేటప్పుడు, ఒక పాదంలో ఒక మాత్ర కాలం మిగిలివుంటే ఒక్క లఘువును మాత్రమే ఉంచగలం; I అన్నమాట. రెండు మాత్రల కాలంలో మనకు రెండు విధాలుంటాయి: II లేక U. మూడు మాత్రల కాలంలో మూడు (III, UI, IU) విధాలు. నాల్గు మాత్రల కాలంలో నాల్గు కాదు, ఐదుంటాయి: IIII, IIU, IUI, UII, UU. ఐదు మాత్రల కాలంలో ఎన్నుంటాయి? ఎనిమిది విధాలు ఉంటాయి; ఇలా: IIIII, IIIU, IIUI, IUII, UIII, UUI, UIU, IUU. ఇలా లెక్కవేస్తూ పోతే, మాత్రల కాలం పెరిగేకొద్దీ, దానికి సంబంధించిన సంయోగాలు (combinations) ఒక నిర్దిష్టమైన క్రమంలో పెరుగుతాయి. ఇది గమనించండి: 1, 2, 3, 5, 8, 13, 21, 34, 55, 89, 144, ...

మాత్రలు	సంయోగాలు
1	1
2	2
3	3 = 2 + 1
4	5 = 3 + 2
5	8 = 5 + 3
6	13 = 8 + 5
7	21 = 13 + 8
8	34 = 21 + 13
9	55 = 34 + 21
10	89 = 55 + 34
....	.....

ఇదే క్రమంలో పోతే, n మాత్రల కాలంలో ఇమిడే సంయోగాలు (n-1) మాత్రల కాలంలోనూ, (n-2) మాత్రల కాలంలోనూ ఇమిడే సంయోగాల కూడిక అని మనకు ఇట్టే అగుపిస్తుంది. గణిత శాస్త్రంలో ఈ క్రమాన్ని ఈనాడు "ఫిబొనాచ్చి క్రమం" (Fibonacci sequence) అనే పేరుతో పిలుస్తారు. "ఫిబొనాచ్చి" గా పిలవబడే "లియోనార్డో ఆఫ్ పిసా" అనే గణిత శాస్త్రజ్ఞుడు పదమూడో శతాబ్దంనాటి (1175-1250 AD) వాడు. కానీ, ఈ క్రమం క్రీస్తుపూర్వం (200-100 BC) నాటి పాణిని సమకాలికుడైన పింగళునితో మొదలు, విరహాంక (600-800 AD), గోపాల (1135 AD), హేమచంద్ర (1150 AD) వరకూ ఎంతో మంది మహాకవులకు ఎప్పుడో తెలుసు [1, 2]. అది ఛందస్సుకు సంబంధించినది. పద్య-శ్లోక రచనకు పైన చెప్పిన రీతిలో అత్యవసరమైనది.

హేమచంద్ర పైన ప్రస్తావించిన సంఖ్యల క్రమం (దీనిని హేమచంద్ర-ఫిబొనాచ్చి క్రమం అనడం సబబు) సమ-మాత్ర పద్య లేక శ్లోక రచనలతో ఎలా ముడిపడి ఉందో చక్కగా నిరూపించారు. ఆ నిరూపణని, శ్లోకంలోని ఒక పంక్తిగా, క్లుప్తంగా, నిగూఢమైన రీతిలో తెలియజేశారు. ఇలా: "అటువంటి ప్రతీ క్రమం ఒక గురువుతోనో లేక లఘువుతోనో ముగుస్తుంది". సుస్పష్టమైన ఈ విషయం ఉపపత్తి (నిరూపణ) ఎలా ఔతుందో అని ఫీల్డ్స్ మెడల్ గ్రహీత ప్రొ. మంజుల్ భార్గవ (Princeton University) తబలా వాయిస్తూ చక్కగా వివరించారు [3]. అన్నట్టు, ఫీల్డ్స్ మెడల్ గణిత శాస్త్రజ్ఞులకి ఇచ్చే నోబెల్ పురస్కారం లాంటిది.

హేమచంద్ర ఉపపత్తిని ఇలా అర్థం చేసుకోవచ్చు.

మూడు మాత్రల పదాలు రెండు విధాలుగా వస్తాయి. ఒక మాత్ర పదానికి (అంటే I కి) గురువుని జోడించడం (IU) ఒక విధం. రెండు రెండు మాత్రల పదాలకు (అంటే II, U లకు) చివర్న ఒక లఘువుని జోడించడం (III, UI). ఇలా, మూడు మాత్రల పదాల సంఖ్య, ఒక మరియు రెండు మాత్రల పదాల సంఖ్యల మొత్తం అన్నమాట.

ఇంకో ఉదాహరణ: పది మాత్రల పదం ఒకటి తీసుకొందాం. అది IIUUIIII అనుకొందాం. ఇటువంటి పది-మాత్రల పదాలు ఎన్నో ఉంటాయని పైన గమనించాం. అదో పెద్ద సంఖ్య. పది మాత్రలు ఉన్నాయి కనుక, దీన్ని H10 అని సూచిస్తాం. IIUUIIII కి చివర్న ఒక గురువు జోడిస్తే, పన్నెండు మాత్రల పదం IIUUIIIIU వస్తుంది. ఇప్పుడు పదకొండు మాత్రల పదం IIUUIIIU తీసుకొందాం. ఇటువంటివి కూడా ఎన్నో ఉంటాయ్. అది కూడా పెద్ద సంఖ్యే. దానిని H11 అని సూచిస్తాం. IIUUIIIU కి చివర్న ఒక లఘువు జోడిస్తే పన్నెండు మాత్రల పదం IIUUIIIUI వస్తుంది.

ఇప్పుడు ఒక సూక్ష్మమైన విషయం గమనించాలి: పన్నెండు మాత్రల పదాల సంఖ్య (H12) పది మరియు పదకొండు సంఖ్యల కూడిక. అంటే, H12 = H10 + H11. ఎందుకంటే, హేమచంద్ర చెప్పినట్టుగా, ప్రతి పన్నెండు మాత్రల పదం ఒక గురువు చివర్న ఉన్న పది-మాత్రల పదమో లేక ఒక లఘువు చివరన వున్న పదకొండు-మాత్రల పదమో అయ్యుండాలి! దీనిని ఒక పునరావృత సూత్రం (recursive formula) గా రాయొచ్చు:

$$H_n = H_{n-2} + H_{n-1}.$$

n	Hn	ఉదాహరణలు
1	H1= 1	I
2	H2= 2	II, U
3	H3 = H1 + H2 = 3	III, IU, UI
4	H4 = H2 + H3 = 5	IIII, IIU, IUI, UII, UU
5	H5 = H3 + H4 = 8	IIIII, IIIU, … ఇలా మొత్తం ఎనిమిది
6	H6 = H4 + H5 = 13	IIIIII, IIIIU, … ఇలా మొత్తం 13
7	H7 = H5 + H6 = 21	IIIIIII, IIIIIU, … ఇలా మొత్తం 21
…	…	…
12	H12 = H10 + H11 = 233	IIIIIIIIIIII, IIIIIIIIIIU, … ఇలా మొత్తం 233

(ఇంకా వుంది)

నందుల ప్రభాకర శాస్త్రి

మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

మార్చి, ఏప్రిల్ మాసంలో ఈ పంట చేతికి వస్తుంది. కాబట్టి బాగా ఎండుతాయి. రాగి కోతకోసే దానికి ఓ వారం రోజుల ముందు 'ఎద్దడుగ కనుమ'కు పోయి నాలుగైదు అడుగుల పొడవుండి, చక్కగా వుండి, బొట-నవేలి మందంలో వుండే కట్టెలు ఓ వంద కొట్టుకొనొచ్చి, వాటిని వామి దగ్గర వంచి నిలబెట్టేవారు. వారం పది రోజులకు ఈ కట్టెలు వంగి 'విల్లు' ఆకారంలో తయా-రయ్యేవి. ఈ కట్టెలతో కంకులు కొట్టేవారు.

నాలుగవ వరుస మొదళ్ళ పైన ఆడకూలీలు వరుసగా పదిమంది నిలబడతారు. ఈ వంగిన కట్టెలు తీసుకుని పిల్లలు స్కిప్పింగ్ ఆడే-టప్పుడు తాడు తిప్పినట్టు ఈ కట్టెలను తిప్పుతూ కంకులపై బలంగా కొడుతూపోతారు. అడుగులో అడుగు వేసుకుంటూ పైనుండి కిందకి, కిందనుండి పైకి కదులుతూ కట్టెలతో కొ-డుతూవుంటారు. లయబద్ధం-గా ఇరవై కట్టెలు ఒకేసారి పైకి లేవడం, కిందకి రావడం, 'శివ-తాండవం' తలపించేది.

ఇట్లా రేను, మూడు రోజులకు కొట్టటం అయిపొయ్యేది. రాగుల రాసి పాడేది. గడ్డి అంతా కుప్పలు పోసి, పొట్టు అంతా కుప్ప వేసి, రాగులు 'తూర్పు' పట్టేవారు.

ఎత్తైన ప్రదేశం నుండి చేతలతో ఈ రాగులు పోసినప్పుడు గట్టిగా వుండే రాగులన్నీ ఒకచోట పడి, పొట్టు, నూగు అంతా గాలికి దూరంగా పడతాయి. ఆ సమయంలో గాలి కూడా నెమ్మదిగా వస్తూ వుంటుంది. ఏదైనా కారణంతో గాలి వెయ్యటం నిలిచిపోతే తూర్పు ఆరపెట్టేవాడు 'పులోలిగా', 'పులోలిగా' అంటూ గట్టిగా గాలిని పిలిచేవాడు. కొంచెం సేపటికి సన్నగా గాలి వీచేది.

రాగులన్నీ కుప్ప చేసి కూలీలకు కొలిచి గంపలతో ఇంట్లో గరిశిలో నింపుతారు. మా ఇంట్లో మూడు పెద్ద పెద్ద గరిశలు ఉండేవి. ఒక్కొక్క గరిశ మూడు 'పుటలు' పట్టేది. పుట్టి అంటే ఇరవై తూములు, తూముకు రెండు ఇరసాలు, ఇరసకు పదకొండు సేర్లు. ఈ మూడు గరిశలు నిండి ఇంకా సంచులకు మిగిలేవి. మా పెద్దనాయన పది పుట్లు అయినాయి అని తల ఎగిరేసి గర్వంగా చెప్పేవాడు.

జొన్న పంట

'రసికులు పోవడు పలనాడు' అని శ్రీనాధ కవి అన్నాడు. జొన్న, సంగటి, జొన్న అంబలి రసికులకు ఇష్టముండదేమో గాని, జొన్న పంట మాత్రం రసికరాజుల హృదయాలను కొల్లగొడుతుంది. మనిషి చేయి ఎత్తున పెరిగిన ఈ జొన్న పంట పొలంలో రసికత పొలంలో రసికత ఉట్టిపడుతుంది. జంటలుగా ప్రేమికులు, దంపతులు కూడా ఈ పొలాన్ని తమ రసిక సామ్రాజ్యానికి రంగస్థలంగా వాడుకుంటారు.

ఉమ్మడి కుటుంబాలు, ఇరుకు ఇళ్ళు, అత్తలు, ఆడబిడ్డలు, బావలు, బావమరదులు, దంపతులు కూడా ఒకరితో ఒకరు మనసు విప్పుకుని మాట్లాడుకునే అవకాశం తక్కువ. అందుకే జొన్న చేలు ఆహ్లాదంగా కనిపిస్తాయి.

(ఇంకా వుంది)

మహిళలలో చైతన్యం ---- శ్రీమతి కమల

కుటుంబం లో స్త్రీ పాత్ర ఎంతో అమూల్యమైంది. ఆమె కుటుంబానికి చేసే సేవ విలువ కట్ట లేనిది. అయితే పిల్లల బాధ్యతలు తీరాక ఒక్కసారి ఒంటరిదైన ఆడది పిల్లలు దూరమయ్యారని బెంగగా, వారిగురించే ఆలోచిస్తూ, ఆరోగ్యం పాడుచేసుకోవడమో, లేదా సమయాన్ని ఎలా ఉపయోగించాలో తెలియక సీరియల్స్ చూస్తూనో, అక్కరలేని కబుర్లతో కాలక్షేపం చెయ్యడమో సాధారణంగా జరుగుతూ ఉంటుంది. అంతే కాదండోయ్ ఎదుటి వారి సమయాన్ని కూడా వృధా చేస్తూ బుర్ర కూడా తింటారు. కానీ హైదరాబాదు అత్తాపూర్ లోని జనప్రియలో నివాసముంటున్న 'శ్రీమతి కమలగారు' అందరికీ ఆదర్శంగా ఉంటున్నారు. తాను ఆనందంగా, భక్తిగా సత్య సాయి బాబా భజనలు చేస్తూ, ప్రజలకు సేవ చేస్తూ పిల్లలకోసం ఏవిధంగా కాలాన్ని సద్వినియోగం చేస్తున్నారో మీరే ప్రత్యక్షంగా చూడండి.

మొత్తం వీడియో కొరకు ఇక్కడ క్లిక్ చేయండి.

ఎలక్ట్రాన్

విద్యాఘాతము

(గత సంచిక తరువాయి)

రామకృష్ణ చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు రఘురామ్. అతని మాటల్లో నిజాయితీ గోచరించింది. అయినా రామకృష్ణని తాత్కాలిక నిర్బంధంలోకి తీసుకొన్నాడు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో రఘురాం కాస్త ఊపిరి తీసుకొనే సమయంలో 'పర్ణసి' ప్రధానోపాధ్యాయిని రాజామణి నుంచి టెలిఫోన్ వచ్చింది. తమ స్కూల్లో సెకండ్ ఇంటర్ చదువుతోన్న వసంత అనే అమ్మాయి దగ్గర్లోనే ఉన్న ఓ మామిడి తోటలో ఓ చెట్టుకొమ్మకి చున్నీతో ఉరేసుకొని చచ్చిపోయిందని. రఘురాం వెంటనే తన బలగంతో అక్కడికి వెళ్ళాడు.

తోటకి మధ్యగా ఓ నుయ్యి ఉంది. ఆ నూతి మీదుగా దగ్గరగా ఉన్న ఓ మామిడి చెట్టు కొమ్మ పోతోంది. నూతిలో నీళ్ళు లేవు. వసంత శవం నూతిలోకి వేళ్లాడుతోంది. నూతి గట్టు మీద నిల్చుని చున్నీతో కొమ్మకోముడీ, తన మెడకో ముడీ వేసుకొని నూతిలోకి గెంతు వేసి ఉండాలనుకొన్నాడు. వేలాడుతోన్న వసంత దేహానికి ఫోటోలు తీసిన తర్వాత కిందకి దించారు. వసంత జుట్టు చెదిరి ఉంది, కుర్తా పైబొత్తాలు రెండూ తీసి ఉన్నాయి. లోపలి నల్లటి బ్రాసరీ హుక్ తీసి ఉంది. రఘురాం చున్నీ ముడిని మెడనుంచి తీసి, వసంత మెడని పరిశీలించాడు. వసంత చెప్పులు మామిడి చెట్టు మొదట్లో పడి ఉన్నాయి. నూతిగట్టు దగ్గర మట్టిలో ఏదో మెరుస్తూ కనబడింది. గులాబీ రంగులో ఉన్న ఓ ప్లాస్టిక్ పూస. చిట్టి ఉంది. దాన్ని జాగ్రత్త పరిచాడు. వసంత దేహాన్ని శవపరీక్షకి పంపి, 'పర్ణసి' ప్రాంగణానికి దారి తీశాడు.

రాజామణి వణుకుతోన్న స్వరంతో రఘురాంకి స్వాగతం పలికి, తన ఆఫీసు గదికి తీసుకుపోయింది. నరోత్తమదాసు కూడా అక్కడే ఉన్నాడు. అతని ముఖం చాలా ఆందోళనతో ఉన్నట్లనిపించింది.

"ఒకే విద్యా సంస్థకి చెందిన రెండు పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులు ఒకే సమయంలో మరణించడం మాకు విద్యుదాఘాతం లాంటిది! ఈ ఆత్మహత్యలకు కారణం నిర్ధారించి మాకు అపప్రథ రాకుండా చూడండి," అంది రాజామణి ఆందోళనగా. ఆమె నుదుటున స్వేదబిందువులు స్పష్టంగా కనబడ్తున్నాయి. జాకెట్లో దోపుకొన్న చిన్న రుమాలు తీసుకొని నుదుటున కొంది. రఘురాం ముక్కుపుటాలు ఎగరవేశాడు.

"మీకే కాదు. మా పోలీసులకీ అపప్రథే! వసంత ఇంటికి కబురు పంపారా?"

"ఆమె తల్లి దండ్రులు దగ్గర ఊర్లోనే ఉంటారు. కారు పంపాను." అంది రాజామణి.

"సుబ్బారావు తల్లిదండ్రులతో, వసంత తల్లిదండ్రులతో, పత్రికావిలేకరులతో సహనం వహించి మాట్లాడండి. మీరు

నోరు జారితే ఊరూ,వాడా ఏకమౌతుంది. అమ్మాయిల వసతి గృహంలో వసంత గదిని చూసి వస్తాను," అని రఘురాం లేచి వెళ్ళాడు. రఘురాం మాటల్లోని అర్థాన్ని వెదకసాగారు రాజామణీ, నరోత్తమదాసులు.

రఘురాం వసంత ఉండే గదిని నిశితంగా పరిశీలించాడు. రఘురాంకి వసంత బల్లసొరుగులో ఉన్న కెమిస్ట్రీ నోటుపుస్తకంలో ఓ రెండు ఉత్తరాలు దొరికాయి. అవి నిస్సహాయ పరిస్థితిని వ్యక్తం చేస్తూ, వ్యధాపూరితంగా రాసిన ప్రేమలేఖలు. తేదీలు వారం తేడాగా ఉన్నాయి. రెండు ఉత్తరాల్లోనూ 'ఎస్' అన్న పొడి అక్షరం సంతకంగా ఉంది. రఘురాం రెండు ఉత్తరాల్నీ ముక్కుదగ్గరపెట్టుకొని వాసన చూశాడు. రెండుమూడు ఫోటోలు తీసిన తర్వాత వసంత పుస్తకాలనీ, ఇతర వస్తువుల్నీ పోలీసు స్టేషన్ కి పంపించాడు.

వసంతతో బాటు అదే గదిలో ఉండే మంజుల దూరంగా వసారాలో భయాందోళనలతో నిలబడి ఉంది. రఘురాం ఆమె వద్దకు వెళ్ళి చాలా సౌమ్యంగా మాట్లాడాడు. ప్రశ్నించాడు. ఆమె వలన చాలా వివరాలు తెలిసాయి.

క్రితంరోజు మధ్యాహ్నం మొదటి పీరియడ్ లో కనకారావుగారనే కెమిస్ట్రీ లెక్చరర్ పాఠం చెబుతున్నసమయంలో, ఆఫీసులో చిల్లరపనులు చేసే రాములమ్మ వచ్చి, వసంతకి టేలీఫోన్ వచ్చిందని చెప్పింది. వసంత కనకారావు అనుమతి తీసుకొని, క్లాసు వదిలి బయటకు వెళ్లింది. వసంతనందరూ సజీవంగా చూడ్డం అదే చివరిసారి.

మంజుల ఆ సాయంత్రం క్లాసులు ముగిసిన తర్వాత, క్లాసుకు తిరిగిరాని వసంత పుస్తకాలు కూడా తీసుకొని గదికి తీసుకుపోయి, వాటిని ఆమె బల్లమీద ఉంచింది. మంజుల రాత్రి ఎనిమిదన్నరకి మెస్ కి పోయి భోజనం చేసి గదికి వెళ్లింది. వసంత అప్పటికీ తిరిగిరాకపోయే సరికి, హాస్టల్ వార్డెన్ శ్యామలాదేవికి విషయం చెప్పింది. అత్యవసర పరిస్థితిలో ఇంటికి కానీ వెళ్ళిందేమోనని సరిపెట్టుకొన్నారు. ఫోను ఉన్న వసంత పెదనాన్నగారింటికి ఫోను చేస్తే, ఎవరూ ఎత్తకపోవడంతో చేసేదిలేక ఊరుకొన్నారు. ఈ రోజు మధ్యాహ్నం మామిడితోటలో పుల్లలు ఏరుకోడానికి కంచె దాటి వెళ్ళిన ఓ నడివయసు పల్లెటూరు స్త్రీ, చెట్టుకొమ్మకి వేలాడుతున్న వసంత శవాన్ని చూసి భయంతో కేకలు వేసింది. కూతవేటు దూరంలో ఉన్న గుడిశెల్లోంచి జనాలు పరుగెత్తుకుంటూ వెళ్లారు. ఆ కబురు చివరికి పాఠశాల చేరింది. ప్రిన్సిపాల్ రాజామణి ఆఫీసులో పని చేసే సరళ అనే ఆవిడ అక్కడకు వెళ్ళి, వసంత మృతదేహాన్ని గుర్తించి, రాజామణికి కబురందజేసింది. రాజామణి పోలీసులకు ఫోన్ చేసింది.

"వసంతమరీఅంతఎక్కువగా చదివే రకం కాదు. మార్కులు ఎప్పుడూ డెబ్బైల దరిదాపుల్లోనే. అప్పుడప్పుడూ పోస్టులో కవర్లు వచ్చేవి. ఇంటిదగ్గర్నుంచి అనేది. కానీ కవర్లలోపల లేతగులాబీ రంగుల కాయితాల్ని గమనించి అవి ప్రేమలేఖలని గ్రహించాను. వసంత అమ్మగారు ప్రతి పదిహేను రోజులకీ ఓ ఆదివారం తినుబండారాలూ, యిస్త్రీ చేసిన దుస్తులూ తీసుకువచ్చేది. వచ్చి గదిని శుభ్రంగా సర్ది పెట్టేది. మాసిన దుస్తులు కూడా తీసుపోయేది. వసంతకి వాళ్ళమ్మంటే కొంత బెదురుగా ఉండేది. అన్నీ సర్దుతుందన్న భయంతో ఒకటి రెండు సార్లు చదివి వెంటనే చింపి పారేసేది. ఓ సారి ఓ ముక్క గాలికి ఎగిరి నా బల్లమీద పడింది. అందులో 'నీ సుబ్బారావు' అని సంతకం ఉంది.

"రెండు రోజుల క్రితం వసంత నాతో, 'ఎందుకే, పరీక్షలంటే అంత భయపడి పోతావ్? బోర్డు పరీక్షలకేం, ఎలానూ ప్యాసైపోతామ్. ఇంక యింజనీరింగ్ ప్రవేశపరీక్ష లంటావూ, ఎవరో చాలా అనుభవం గల ప్రొఫెసర్ తయారుచేసిన ఓ అపూర్వమైన మోడల్ పేపరు త్వరలో దొరకబోతోంది. దాంతో మనిద్దరం కలిసి కుస్తీ పట్టామా, ర్యాంక్ గ్యారంటీ!' అంది."

మంజుల మాటలు విన్న రఘురాం ఆలోచనలో పడ్డాడు. ఓ నిముషం తర్వాత అడిగాడు. "ఈ విషయం నువ్వు ఎవరితోనైనా ప్రస్తావించావా?"

లేదన్న ఆమె సమాధానం విని రఘురాం ఓ నిశ్వాసం విడిచాడు. వెంటనే మంజులని పుస్తకాలతో సహా జీప్ఎక్కించి వాళ్ళ ఇంటివద్ద దిగబెట్టించాడు. మంజుల తనతో మాట్లాడిన విషయాల్ని ఎవరితోటి చెప్పొద్దనీ, ఒకవేళ ఎవరైనా ఆరాలు తియ్యడానికి ప్రయత్నిస్తే "రూమ్ మేట్ మరణంతో వ్యాకులంగా ఉందని సర్ది చెప్పి పంపివేయండి" అని తల్లిదండ్రుల్ని హెచ్చరించాడు.

రఘురాం ఆ తర్వాత రాజామణి ఆఫీసుకు వెళ్ళి నరోత్తమ దాసునీ, రాజామణినీ చాలా ప్రశ్నలడిగాడు. అక్కడ వేచిఉన్న సుబ్బారావు తల్లి దండ్రుల్నీ, వసంత తల్లిదండ్రుల్నీ ఓదార్చి, పత్రికావిలేకరులకు అటూ ఇటూ కానీ లౌక్యమైన సమాధానాలిచ్చాడు.

రెండు రోజుల తర్వాత శవపరీక్షల, ఇతర పరీక్షల సమాచారం అందింది. సుబ్బారావు విషప్రయోగం వల్ల చనిపోయాడు. ఒక చిత్తు నోటు పుస్తకంలో, చనిపోయిన రోజున సుబ్బారావు చేయప్రయత్నించిన కొన్ని ఫిజిక్స్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. మొదట్లో బావున్నా పోను పోనూ దస్తూరీ చెదిరింది. అంటే అప్పటికే నిద్రమత్తు ముంచుకు వచ్చింది తర్వాత శ్వాస ఆగిపోయింది. సుబ్బారావు బల్లమీద నున్న నీళ్ళ సీసాలో విషం కలపబడి ఉంది. సుబ్బారావు నోటుపుస్తకంలో కనబడ్డ పొట్లం కాయితంలో విషశేషాలు కనబడ్డాయి.

వసంతని ముందుగా ఎవరో గొంతు పిసికి చంపి, ఆ తర్వాత చున్నీతో వేలాడదీశారు. కంఠం మీద బిగిసిన వేళ్ల ఆనవాళ్లకీ, సుబ్బారావు చేతివేళ్లకీ పొంతన లేదు. అవి రామకృష్ణ వేళ్లతోటీ జత కుదరలేదు. మరణానికి ముందు వసంతని ఎవరో అనుభవించడం జరిగింది. అయితే బలాత్కారపు చిహ్నాలు లేవు. జననేంద్రియంలో ఉన్న వీర్యంతో బాటు, గర్భనిరోధక మాత్రలు ఉపయోగించిన నిదర్శనాలు కనిపించాయి. ఆ వీర్యశేషాన్ని, సుబ్బారావు దేహంలోంచి తీసిన ఓ చిన్న చర్మఖండాన్నీ జన్యు పరీక్షలకి హైదరబాద్ పంపించడం జరిగింది. వసంత నోటు పుస్తకంలో దొరికిన ప్రేమలేఖల లోని దస్తూరీ సామాన్యులకి చూడ్డానికి ఒకేలా కనిపించినా, చేతిరాతల నిపుణుల అభిప్రాయం ప్రకారం అవి ఎంతో నైపుణ్యంతో రాయబడిన దొంగ ఉత్తరాలు. అక్షరాల సైజు ఒక్కటే అయినా, గీతల మందంలో కొద్దిపాటి తేడా ఉంది. సుబ్బారావు బాల్ పాయింట్ పెన్నులు 0.5 టిప్ వి(కొన సైజు). ఉత్తరాలలోని అక్షరాలు 0.6 టిప్ తో రాసినవి. ఏనుగు మార్కు తెల్లకాయితం మీద రాసినవి. ఆ దస్తూరి రామకృష్ణ కాదు, అతను ప్రయత్నించినదీకాదు.

రఘురాం ఆలోచనలో పడ్డాడు. ఇవి ఆత్మహత్యలు కావు. వసంత మరణం విషయంలో సుబ్బారావు మీద అనుమానం కలగడానికి

వసంత పుస్తకాలలో దొంగ ఉత్తరాలు ఉంచడం జరిగింది. వసంతను అనుభవించి, చంపి తర్వాత సుబ్బారావు ఆత్మహత్య చేసుకొన్నట్టుగా జనం నమ్మాలి. ఉత్తరాలే సృష్టించబడినప్పుడు, వాటిలో ఉన్న విషయం కూడా వాస్తవం కాదు. అటువంటప్పుడు సుబ్బారావు ఆత్మహత్య చేసుకో వలసిన అవసరం లేదు. పాథాలజిస్టు నిర్ధారించిన వసంత మరణ సమయంలో రామకృష్ణ మధ్యాహ్నం క్లాసులో ఉన్నాడు. అయితే సుబ్బారావు నీళ్ళసీసాలో విషం కలపడానికి రామకృష్ణకి అవకాశం ఉంది కానీ, బలమైన కారణం ఏమీ లేదు. అంటే-వసంతను చంపిన వ్యక్తులకి, సుబ్బారావు వసంతను కలుసుకోడానికి మామిడి తోపుకి వెడ్తున్నాడన్న సంగతి తెలుసు. ఎలా? అదే.....వసంతకి వచ్చిన టెలిఫోన్ కాల్ మరెవరో విన్నారు. హత్య చేయవలసినంత కారణం ఆ సంభాషణలోనే ఉండాలి. 'నీ కంటే మంచి ర్యాంక్ సంపాదిస్తాను'-అని సుబ్బారావు రామకృష్ణతో అన్నమాటలూ, 'అపూర్వమైన మోడల్ పేపరు దొరకబోతోంది'-అని మంజులతో వసంత అన్న మాటలూ రఘురాం మదిలో మెదిలాయి.. రెండు రోజులక్రితం మంజులతో మాట్లాడుతున్నప్పుడు ఏర్పడిన అనుమానం ఇప్పుడు బలపడింది.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ముకుందం గారి గదిలో కూర్చుని ఆయన పిలిపించినట్టుగా కబురంపాడు రఘురాం. స్టాఫ్ రూమ్ లో కబుర్లు చెబుతున్న కెమిస్ట్రీ లెక్చరర్ కనకారావు హడావుడిగా వచ్చాడు. భారీ విగ్రహం. కండలు తిరిగిన శరీరం. కుర్చీలో కూర్చోగానే కనకారావుని రఘురాం ప్రశ్నించాడు.

"మూడు రోజుల క్రితం అంటే ఫిబ్రవరి ఇరవై ఎనిమిదో తారీఖున మధ్యాహ్నం రెండింటి నుంచి మీరెక్కడున్నారు?"

"తలనొప్పి వచ్చి, మధ్యాహ్నం మా కెమిస్ట్రీ హెడ్ అనుమతి తీసుకొని ఇంటికి........." కనకారావు హఠాత్తుగా మాట మధ్యలో ఆపేసి ,పోలీసు దుస్తుల్లో ఉన్నరఘురాం వైపు భయం భయంగా చూశాడు.

రఘురాం చిన్నగా నవ్వి అన్నాడు. "ఊరందరికీ తెలిసిన రహస్యం కప్పిపుచ్చుకోడానికి మీరు చేసే ప్రయత్నం నవ్వు తెప్పిస్తోంది, జాలి కలిగిస్తోంది. మీరు ఆ సమయానికి పర్ణసి పాఠశాలలో పాఠం చెప్తోన్నట్టు ఒక్క మరణించిన వసంత తప్ప, మిగిలిన నలభై నలుగురు విద్యార్థినులూ సాక్ష్యామివ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వసంత మీ అనుమతి తీసుకొని క్లాసు వదిలింది. చనిపోయింది ఆమేనని గుర్తుపట్టి, మీరు కూడా సంతకం చేస్తే, ఈ రోజు దేహాన్ని వాళ్ళ తల్లిదండ్రులకి ఇవ్వడానికి వీలవుతుంది. చిన్న ఫార్మాలిటీ!"

రఘురాం మాటలు వింటూనే 'యింతకాలానికి దొరికావురా కనకారావూ!' అనుకొన్నాడు ప్రిన్సిపల్ ముకుందం.

కనకారావుకి వసంతని గుర్తుపట్టక తప్పలేదు. శవపరీక్ష చేసిన పాథాలజిస్ట్ కనకారావు వేళ్ళకే, శవం మెడమీదనున్న ఆనవాళ్ళకీపొత్తుకుదిరిందన్నాడు. రఘురాం వెంటనే కనకారావుని కస్టడీలోకి తీసుకొన్నాడు. తనొక్కడే మునగడం యిష్టం లేక కనకారావు నోరు విప్పాడు. పోలీసు స్టేషన్ కి పోయి, రాజామణిని వెంటనే హాజరు కమ్మని కబురు పంపాడు. ఏం జరిగిందో తెలియని రాజామణీ, నరోత్తమదాసూ హడావుడిగా పోలీసు స్టేషన్ కి వెళ్ళారు.

ఏ విధమైన ఉపోద్ఘాతమూ లేకుండా, 'ఇప్పుడు చెప్పండి రాజామణి గారూ! మొన్న ఫిబ్రవరి 28వ తారీఖు మధ్యాహ్నం సుబ్బారావు టెలిఫోన్లో వసంతతో ఏం మాట్లాడింది?"

"విద్యార్థినులకి ఒకసారి అనుమతినిచ్చిన తర్వాత ఎక్స్టెంషన్ ఫోన్లో మాటలు వినేటంతటి కుసంస్కారిని కాదు!" అని రాజామణి జాకెట్ లోని రుమాలు తీసి మొహం కొంటూ.

"పోనీ ఇదే రకం సెంటువాసన, వసంత పుస్తకాల్లో దొరికిన ప్రేమలేఖలికి ఎలా వచ్చిందో చెప్పండి! ఆ ఉత్తరాలు ఫోర్జరీలని మాకు తెలిసిపోయింది! ఆ ఫోర్జరీ ఉత్తరాల్ని మీరే స్వయంగా వసంత నోటు బుక్ లో మంజుల డిన్నర్ కి వెళ్ళిన సమయంలో ఉంచారు." రఘు తాపీగా అన్నాడు. రాజామణికి పట్టిన చెమటని తుడుచుకోడానికి ఆ చిన్న రుమాలు చాలలేదు.

"తనకి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల పేపరు దొరికిందనీ, వెంటనే పర్ణసి పాఠశాల వెనకనున్న మామిడితోటకు రమ్మని సుబ్బారావు వసంతకి ఫోన్ చేశాడు. ఆ మాటలు మీరు విన్నారు. ప్రతి ఏడులాగే లక్షలు వెచ్చించి మీరు పేపర్ని సంపాదించారు. ఆ పేపరు ఆధారంగా పది, ఇరవై, ముప్ఫై శాతం నకిలీ ప్రశ్నలు చొప్పించి కొన్ని మోడల్ పేపర్లు తయారు చేసి లోపాయికారిగా కొందరు విద్యార్థులకీ, కొన్ని శిక్షణాసంస్థలకి అమ్మి విపరీతంగా సొమ్ములు చేసుకొనే పథకంలో, సుబ్బారావు సంపాదించిన పేపరు మీ ఆదాయానికి గండి కొడ్తుందని భయపడి ఈ రెండు హత్యలకీ దారుణంగా పూనుకొన్నారు. ఓ నిర్దిష్టమైన ప్రణాళిక లేక మీరు కనకారావుతో సహా మామిడితోట చేరుకొన్నారు. అప్పటికే సుబ్బారావు తన భౌతికమైన అవసరం తీర్చుకొని, వసంతకి పేపరు కాపీనిచ్చి వెళ్లిపోవడం జరిగింది. మీరు వసంతనుంచి బలవంతంగా పేపరు తీసుకొని, శాశ్వతంగా ఆమె గొంతు మూసేశారు. అక్కడ ఉపల వసతి గృహంలో సుబ్బారావు, రామకృష్ణలు భోజనాలకి వెళ్లినప్పుడు వీరభద్రం 212 గదిలో ప్రవేశించి సుబ్బారావు సంపాదించిన పేపర్ని తస్కరించి , అతని నీళ్ళసీసాలో విషం కలిపి, విషం పొట్లాం కాయితాన్ని అతని ఓ పుస్తకంలో ఉంచారు. వీరభద్రం బ్లాకులు తయారు చెయ్యడంలోనూ, ఫోర్జరీలు చెయ్యడం లోనూ సిద్ధహస్తుడు, అతనిదివరకో సారి కోయంబత్తూరు దొంగ నోట్ల కేసులో జైలు శిక్షననుభవించాడు. రామకృష్ణ కనక ఆ నీళ్లు పొరబాటున తాగి ఉంటే తనకే విధంగానూ వర్తించని దారుణానికి బలైపోయే వాడు. సినిమాకి పోవడం ఒక విధంగా అతని అదృష్టం. అన్నట్టు మరిచాను. కనకారావు, వీరభద్రం మా కస్టడీలో ఉన్నారు రాజామణిగారు! మీ కాలిచెప్పు పట్టీమీద గులాబీరంగు పూస మామిడితోటలోని బావి గట్టున పక్క దొరికింది!"

రాజామణి అప్రయత్నంగా తలవంచి పాదాలవైపు చూసుకొంది. నరోత్తమదాసు తలనెవరో రోట్లో వేసి రుబ్బుతోన్నట్లనిపించింది.

రఘురాం క్షమార్పణలు చెప్పుకొని రామకృష్ణని విడు దల చేశాడు. ప్రశ్నాపత్రం సంపాదించుకోవడం కోసం సుమారు లక్షరూపాయల దాకా శిక్షణ సంస్థకి లంచం పెట్టిన సుబ్బారావు తండ్రి తను చేసిన తప్పుకి రెండు ప్రాణాలు బలైపోయాయని నెత్తీ నోరూ బాదుకొన్నాడు. వసంత తల్లిదండ్రులు కూతురు ప్రాణంపోయినందుకు కాదు కానీ శీలం పోయినందుకు చింతించారు.

***

భువనచంద్ర

అగ్ని

ఊరువూరంతా అట్టుడికిపోతోంది. ఎప్పుడు ఎవర్ని ఏం చేస్తాడో అన్న భయం గుప్పిట్లో జనాలు ఒణికిపోతున్నారు,

"ఎందుకు బావా ఆలోచిస్తావూ? మనోళ్ళే ఎక్కువమంది వున్నారు. హాయిగా భోంచేసి పడుకో. అన్నీ మేము చూసుకుంటాం", రామ్మూర్తి నాయుడికి భరోసా ఇస్తూ అన్నాడు వీరం నాయుడు.

"ఇక్కడ ప్రశ్న ఎక్కువమందా తక్కువమందా అని కాదు. ఎవరికీ ఎంత బలం ఉందనీ కాదు. అవతలివాడి చేతిలో వున్న ఆయుధం ఏమిటని?", సన్నగా అన్నాడు రామ్మూర్తినాయుడు.

"అంటే?"

"అయిదుగురు పహిల్వాన్లు ఇటు వుండొచ్చు. అవతలివేపు పదేళ్ళ పిల్లాడే వుండొచ్చు. వాడి చేతిలో పిస్తోలుందనుకో... పహిల్వాన్లు ఏం చెయ్యగలరు? కండలు చూపించే లోపే చచ్చూరుకుంటారు", వివరించాడు రామ్మూర్తినాయుడు.

నరసయ్యకీ రామ్మూర్తికీ మధ్య రగిలిన చిచ్చు ఊరిని రెండుగా

విడదీసింది. మొదట విడివడింది కేవలం సానుభూతితో. నరసయ్యని సమర్థించేవారూ, రామ్మూర్తిని సమర్థించేవారుగా మాత్రమే.

ఆ తరువాత అది 'కుల' చిచ్చుగా మారింది. అక్కడితో ఆగక నాలుగేళ్ళలో ఎవడి కులం వాడికి 'దేవత' గా మారి, కులపిచ్చి నెత్తికెక్కి నాట్యం చెయ్యడం మొదలెట్టింది.

ఎవరూ ఎవడ్నీ నమ్మనంతగా, కనీసం మనిషిగా గుర్తించలేనంతగా కులం మహమ్మారి జనాల గుండెల్లో తిష్ట వేసింది. ఆఖరికి ఉప్పూ పప్పూ కొనాలన్నా 'తమ' వారి అంగళ్ళలోనే.

రెండునెలలు గడిచినా పరిస్థితులలో మార్పు రాలేదు. ఆఖరికి చిన్నపిల్లల్లో కూడా 'మీరు వేరు మేము వేరు' అనే మార్పులు చోటుచేసుకున్నాయి. కనిపించని అడ్డుగోడలు.

"సోదరులారా... ఇన్ని కులాలు, ఇందరు దేవుళ్ళు వుండటం వల్లనే మీలో మీకు

చిచ్చు రగులుతోంది. మాకున్నది ఒక్క దేవుడే! అందుకే మీరంతా మాలో చేరిపోండి. మీ దేవుళ్ళు మీకేం చేస్తారో మాకు తెలీదు. కానీ, మీరు గనక మా మతంలో చేరితే, చదువు ఫ్రీగా మా బళ్ళల్లో-నే చెప్పిస్తాం. ఆర్థికసాయం కూడా వుంటుంది. వైద్య సదుపాయాలు కూడా వున్నై. ఆలోచించండి. మీ స్వంత దేవుళ్ళని చూడాలంటే, అధికారమో, అంగబలమో, ఆర్థిక బలమో వుంటే సకల మర్యాద-లూ జరుగుతై. లేకపోతే గంటల తరబడి క్యూల్లో వుండాల్సిందే! మధ్యలో VVVIP లూ VIP లూ వస్తే అంతే సంగతి. మా దేవుడు దగ్గర అలా వుండదు. అందరూ సమానమే. రండి... చేరండి... వెంటనే మతం మార్చుకోం-డి... లబ్ది పొందండి", ఒకాయన జనాల్ని వుద్దేశించి ఉపన్యసించా-డు.

అక్కడ మరోవిధమైన కొట్లా-టలూ, విమర్శలూ. "మీలోనూ చచ్చేన్ని తెగలున్నాయి. నిన్నటి దాకా నువ్వూ యీ మతంలో వు-న్నవాడివేగా? మతం మారుస్తా-ట్ట... ఏం? తల్లీదండ్రుల్ని కూడా మార్చుకోకపోయావా?", అంటూ ఎగబడ్డవాళ్ళు కొందరైతే...

"అరే భాయ్...ఇక్కడి సమస్య దేవుడు కాదు. మనకి ఏ దేవుడైతేనేం! లాభం ఉందా లేదా? ఇదీ ఆలోచించాల్సిన మాట!", ఇది మరొకడి ఉవాచ.

'ఛీ...ఛీ... ఎంతకి దిగజారా-రూ?", మరోకావిడ బాధ.

"మొదట వచ్చిన కులచిచ్చుతో నే చస్తుంటే ఇప్పుడీ మతచిచ్చా?", ఒకాయన అన్నాడు వ్యథతో.

"మాస్టారూ... ఊర్లో అందరి-కంటే మీరు ఎక్కువ తెలివైనవా-రని మా అభిప్రాయం. ఈ వూరి సమస్యని పరిష్కరించాలంటే, నరసయ్యకీ రామ్మూర్తికీ మధ్య సయోధ్య కుదర్చాలి. ట్రై చెయ్య-కూడదూ!", ఊరందరికీ తెలివైన వాడని పేరుపడ్డ సుదర్శనం గారితో అన్నాడు జనరల్ స్టోర్స్ నడుపుకునే కక్కిరాల పుల్లయ్య.

"చూద్దాం!" తల పంకించారు సుదర్శనం మాస్టారు.

****

"శ్రీమద్రమారమణ గోవిందో హరి!" ఒక్క క్షణం ఆపి అన్నాడు వాసుదేవశాస్త్రి. జనాలు ఉత్సా-హంగా గోవింద నామాలని వల్లె-వేశారు.

"అయ్యా, మహాభారత యుద్ధం గురించి చెప్పుకుంటున్నాం. పో-యినవారెవరో, ఎందఱో లెక్క తెలియాలిగా! మొత్తం పాల్గొ-న్న సైన్యం 18 అక్షౌహిణులు. అందులో కౌరవులది 11 అక్శౌహి-ణులైతే, పాండవులది 7 అక్షౌహి-ణులు."

"శాస్త్రిగారూ... అసలు అక్షౌహి-ణిణి అంటే ఏమిటీ?", అడిగారు ముందు వరుసలో కూర్చున్న పోస్ట్ మాస్టారు.

""వస్తున్నాను.... ఒక రథం + ఒక ఏనుగు + 3 గుర్రాలు + ఐ గురు పదాతులు కలిస్తే ఒక పత్తి అవుతుంది.

3 పత్తిలు = ఒక సీనాముఖం
3 సేనాముఖాలు = ఒక గుల్మం
3 గుల్మాలు = ఒక గణం
3 గణాలు = ఒక వాహిని
3 వాహినులు = ఒక పృతన
3 పృతనలు = ఒక చమువు
3 చమువులు = ఒక కినీకిని
10 కినీకినులు = ఒక అక్షౌహిణి

అంటే, ఒక అక్షౌహిణి-లో వుండేది ఇరవైఒక్క వేల ఎనిమిది వందల డెబ్భై రథాలు, ఇరవైఒక్క వేల ఎనిమిది వందల డెబ్భై ఏనుగులు, అరవైఅయిదు వేల ఆరువందల గుర్రాలు, ఒక లక్ష తొమ్మిది వేల మూడువందల యాభై మంది పదాతులు ఉంటా-రన్నమాట!", చెప్పారు శాస్త్రిగారు.

"అబ్బా... 18 అక్షౌహిణుల సైన్యం సర్వనాశనమైందా?!", ఆశ్చర్యపోయారు జనాలు.

"అయ్యా, అటూ ఇటూ అంతులేని ధనవంతులున్నారు, బలవంతులున్నారు... బుద్ధి-మంతులున్నారు కానీ, యుద్ధాన్ని మాత్రం ఎవ్వరూ ఆపలేకపోయా-రు. అందుకే, మనుషులందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే! ధనబలమూ, జనబల-మూ, భుజబలమూ, బుద్ధిబల-మూ ఏదీ సంపూర్ణంగా మనిషిని రక్షించలేవు".

"మరింకేం వుండాలీ?", ప్రశ్నించారు పోస్టుమాస్టారు.

"ఆపైన చెప్పిన 'బలాలు' కావాలన్నా, దైవానుగ్రహం వుండాలి. అందుకే, అన్ని బలాల కంటే గొప్పది దైవబలం", కథ ముగించారు శాస్త్రిగారు.

****

"ఊరంటుకుందిరోరేయ్", ఒక్క అరుపుతో దిగ్గున లేచారు నిద్రపోతున్న వాళ్ళంతా. గుడిసేలూ, పెంకుటిళ్ళూ, గాదెలూ, గొడ్లపాకలూ అన్నీ పరశురామ ప్రీతి అయ్యాయి. అవుతున్నాయి. మంటలు...మంటలు.. ఆక్రందనలు... ఊరు ఊరంతా అర్ధరాత్రి పూట మంటల వెలుగులో సినిమా సెట్ లా వుంది.

నూతుల్లోంచి నీళ్ళు తోడేవారు తోడుతుంటే, ఆర్పేవాళ్ళు ఆర్పుతున్నారు. వీలున్నంతవరకూ ఆహారదాన్యాలనీ, అవసర సామగ్రినీ, ధనాన్నీ ఆభరణాల్నీ రక్షించే ప్రయత్నంలో యువకులున్నారు. అందరూ పనిచేస్తూనేవున్నారు. వీరిల్లూ వారిల్లూ అని కాదు అందరూ అందర్నీ రక్షించే పనిలోనే పడ్డారు. రామ్మూర్తి కింద పడిపోతే, నరసయ్య అతన్ని రెండు చేతులతో ఎత్తి తన మేడ అరుగుమీద పడుకోబెట్టి సేదతీర్చాడు. నరసయ్య మేడలోని ధాన్యాన్నీ, సామాన్లనీ రక్షించిన వాళ్ళలో రామ్మూర్తి కొడుకు దశరధరాముడూ ఉన్నాడు.

****

"నిజంగా ఇది మనకో పాఠం. అగ్ని ఏ పక్షపాతమూ చూపించలేదు. నిత్యాగ్నిహోత్రుల ఇళ్ళని కూడా వదల్లా. హిందువుల ఇళ్ళూ, క్రిస్టియన్ ఇళ్ళూ, ముస్లిముల ఇళ్ళూ అని ఏ తేడా చూపించకుండా అన్నిటినీ దగ్ధం చేశాడు. అంతేకాదు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గ భేదం కూడా పాటించలా. కులభేదం అసలే చూపలేదు. అన్నిటినీ బూడిదగా మార్చింది.

ఇప్పటికైనా మనం బుద్ధి తెచ్చుకోవాలి. అందరం పుట్టింది తల్లికే. అందరం చేరేదీ నేల తల్లి ఒడి లోకే. అగ్ని ఊరిని భస్మం చేసినట్టు మనం మన మనసుల్లోని కుల, మత, వర్గ భేదాల్ని భస్మం చేద్దాం. కలిసికట్టుగా అందరం ఒకటై మళ్ళీ మన గ్రామాన్ని నిర్మించుకుందాం. మనిషినీ మనిషినీ విడదీసే రాజకీయాల జోలికీ, కులమతాల జోలికీ పోమని అగ్నిసాక్షిగా ప్రమాణం చేద్దాం", అన్నారు సుదర్శనం గారు.

అందరూ ప్రమాణం చేశారు. మరో నిర్ణయం కూడా తీసుకున్నారు. రాజకీయాలనీ, రాజకీయ నాయకుల్నీ గ్రామంలో అడుగుపెట్టనివ్వకూడదని.

శుభమస్తు

మళ్ళీ కలుద్దాం

భువనచంద్ర

మా బొమ్మల పెళ్లి

(19 వ పేజీ తరువాయి)

మరువలేని అనుభూతుల్ని మూటకట్టుకున్నాము. బోలెడు ఫోటోలు, వీడియోలు తీసుకుని మురిసిపోయాము. ఈ బొమ్మల పెళ్లి అనుకున్న దగ్గరనుండీ... పూసల దండలు గుచ్చుతూ, బొమ్మలకి బుల్లి బుల్లి బట్టలు కుడుతూ, పెళ్ళికూతురు బుట్టని అలంకరిస్తూ... ఆటలు, పాటలు పూర్వకాలంనాటి సాంప్రదాయాలు, సరదా కబుర్లు గుర్తు చేసుకుంటూ, వియ్యాలవారితో కయ్యాలు పెట్టుకుంటూ... ఓ వారం ఈ పనిలో నిమగ్నమై సంతోషంగా గడిపిన నలుగురైదుగురు, 'మాకు ఈసారి షుగర్ లెవెల్స్ నార్మల్ వచ్చాయి రిపోర్ట్ లలో' అని, 'మాకు మోకాళ్ళ నెప్పులే లేవు, ఇంతసేపు నుంచున్నా, కూర్చున్నా' అంటూ ఇంకొందరు చెప్పడం చాలా ఆనందాన్నిచ్చింది.

బిజీ బిజీ రొటీన్లలో మధ్యలో ఇల్లాంటి కార్యక్రమాలు చాలా విభిన్నంగా ఉంటూ ఉత్సాహాన్ని ఇస్తాయి. మన చిన్నతనపు ఆటపాటల్ని గుర్తు చేసుకుంటూ గడిపిన ఆ నాలుగయిదు రోజులు మా అందరికీ ఓ గొప్ప అనుభూతి.

ప్రహేళిక

జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

(ఆధారం : జ = అసలు అక్షరం 'ట')

సటి బాడగశార - లిటి బాడగశార
లటిడు బిటిడు బా - డగశారలు
బెశడ శూగలుమెమ్మ - బీశూగలే చా
బశడబి డటి బా - డగశారలు,
గశిగూశ్వ్యయపు బిబ్బు - నశిఖ్ఖిబ్బుబిపా
బశడుజ డటి బా - డగశారలు

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

గతనెల జవాబు :

వాళ్ళ నలుపు రంగు కంటె అందరూ ఆడా, మగా ధుమ ధుమలాడుతూ దుంపల్లా మూతులు పెట్టుకుని కనిపించే సరికి నాకే ఏడుపు వచ్చింది.

సెప్టెంబర్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు:

శ్రీ కె మురళీమోహన్

కొత్త రామానందం

శక్తి ప్రియం - ఆశ్వీయుజం

దసరా, దీపావళి, అట్లతద్దె .... ఆశ్వీయుజం అంటే పండగల మాసం. శుంభ నిశుంభ, దుర్గమాసుర, మహిషాసురాది రాక్షసులను దునుమాడిన ఆది పరాశక్తిని ఆరాధించే వేడుక - దసరా. లోక కంటకుడైన నరకాసురుని భూదేవి అవతారమైన సత్యభామ సంహరించిన సందర్భంలో జరుపుకునేది దీపావళి. అట్లతద్దె కూడా దేవి ఆరాధనే. అందుకే ఆశ్వీయుజం శక్తిప్రియం. ఈ సంవత్సరం ఆశ్వీయుజ మాసం 10 - 10 - 2018 న ప్రారంభమవుతుంది.

పౌర్ణమినాటికి చంద్రుడు నక్షత్రాలలో మొదటిదైన ఆశ్వానికి దగ్గరలో ఉండే మాసమే ఆశ్వీయుజ మాసం. మన సంప్రదాయం ప్రకారం ఏడాదికి మూడు నవరాత్రులు. ఒక సంవత్సరాన్ని ఆరు నెలల చొప్పున పూర్వార్ధ (తొలిసగం) ఉత్తరార్ధ (మలిసగం) భాగాలుగా విభజిస్తే మొదటి ఆరు నెలల కాలం లోని తొలిరోజు వచ్చే పండుగ ఉగాది. ఆ ఆర్నెల్లూ ముగిసే సమయంలో జరిపే వేడుకలు గణపతి నవరాత్రులు. ఉత్తరార్ధ ప్రారంభంలో శరన్నవరాత్రుల పేరిట దేవీ ఆరాధన జరుపుతారు.

వసంతం అంటే చలికాలం ముగిసి ఎండాకాలం వస్తుంది. శరదృతువులో వర్షాకాలం ముగిసి చలికాలం మొదలవుతుంది. ఈ సమయంలో వాతావరణంలో కలిగే మార్పులు అనేక రోగాలకు కారణమవుతాయి. అలా కాకుండా శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా శుచిగా శుభ్రంగా ఉంటే ఎలాంటి రోగాలు దరిజేరవన్నది ఈ నవరాత్రి వేడుకల ఉన్న శాస్త్రీయ కోణం.

పురాణాల ప్రకారం ఆది పరాశక్తికి అత్యంత ఇష్టమైన మాసం ఆశ్వీయుజం. ఈ మాసంలో శుద్ధ పాడ్యమి నుండి నవమి దాకా దేవి పూజలతో ఉపవాసాలతో గడుపుతారు. ప్రతి ఇల్లూ పసుపు కుంకుమలతో మామిడాకుల తోరణాలతో, బంతిపూల మాలలతో కొత్త అందాలు సంతరించుకుంటుంది. ఆ తొమ్మిది రోజులూ అమ్మవారిని బాలా త్రిపురసుందరి, లలితా త్రిపురసుందరి, అన్నపూర్ణ, గాయత్రి, సరస్వతి, మహాలక్ష్మి, దుర్గ, మహిషాసుర మర్దిని మరియు రాజరాజేశ్వరి - ఇలా వివిధ రూపాలలో అలంకరించి పూజిస్తారు. మూలా నక్షత్రం నాడు సరస్వతీదేవి అవతారంలో పూజించి పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తారు. ఆ రోజున విద్యాభ్యాసం మొదలుపెడితే చదువు బాగా వస్తుందని ప్రతీతి. అలా అమ్మవారికి ఇష్టమైన ఆశ్వీయుజ మాసంలో భక్తిగా వేడుకలు జరిపితే ఆ దేవి అనుగ్రహించి కోరిన కోర్కెలు తీరుస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలాగే ఈ తొమ్మిది రోజులూ దేవీ ఆరాధన చేస్తే అది సంవత్సరమంతా అమ్మవారికి పూజ చేసినట్లేనని పురాణ ప్రవచనం. అందుకే నిత్యపూజలు చేయలేనివారు కనీసం చివరి మూడు రోజుల్లో అయినా ఆ మహాశక్తిని పూజి-

స్తారు. మహర్నవమి తరువాత వచ్చేది విజయదశమి. ఆరోజున 'శమీ శమయతే పాపం..' అంటూ జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణం చేస్తారు. శమి అంటే జమ్మి. పాపాలను, శత్రువులనూ నశింపజేసేది అని అర్థం. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేముందు తమ ఆయుధాలను జమ్మిచెట్టు పైనే ఉంచారు. ఆ ఆయుధాలతోనే అర్జునుడు ఉత్తర గోగ్రహణంలో విజయం సాధించాడు. విజయదశమి నాటి ఆయుధపూజ వెనుక అంతరార్థమిదే. త్రేతాయుగంలో రాముడు కూడా ఆశ్వీయుజ శుద్ధ దశమి నాడు ఆ ఆదిపరాశక్తిని జమ్మి ఆకుతో పూజించి రావణుని గెలిచాడని దేవీ భాగవతం చెబుతుంది.

ఆశ్వీయుజ బహుళ తదియ నాడు అట్ల తద్దె నోము నోచుకుంటారు. కన్నెపిల్లలు మంచి భర్త రావాలని కోరుతూ గౌరీదేవిని పూజించి అట్లు నైవేద్యం పెడతారు. ఆడపిల్లలంతా ఒకచోట కూడి, ఉయ్యాలలు ఊగుతూ 'అట్ల తద్దోయ్ - ఆరట్లోయ్ - ముద్ద పప్పోయ్ - మూడు అట్లోయ్' అంటూ సందడి జేస్తారు. నవగ్రహాలలో అంగారకుడు అట్ల ప్రియుడు. కనుక వాటిని అమ్మవారికి నైవేద్యంగా పెడితే కుజదోషం తొలగిపోతుందని నమ్మిక. అలాగే అంగారకుడు స్త్రీలలో రాజోదయానికి కారకుడు కనుక మినుగులు, బియ్యం కలిపి జేసే ఈ అట్లు ఋతు సంబంధమైన సమస్యలను నివారిస్తాయన్నది ఈ ఆచారం వెనుక అంతరార్థం. ఇక ఆశ్వీయుజ బహుళ ద్వాదశిని గోవత్స ద్వాదశిగా వ్యవహరిస్తారు. ఆ రోజున ఆవు, దూడలను పూజిస్తారు. సంపదకు మూలమైన గోవులకు ఇచ్చే గౌరవమే ఈ గోవత్స ద్వాదశి వ్రతం. మర్నాడు త్రయోదశి. అపమృత్యు నివారణార్థం యమునికి బలిదీపాన్ని సమర్పిస్తారు. ఈ రోజును యమత్రయోదశి అంటారు. ఉత్తరాదిన ధన్ తేరాస్ గా వ్యవహరిస్తారు.

ఆశ్వీయుజ బహుళ చతుర్దశి - నరక చతుర్దశి. ఈ పర్వదినాన నూనెలో లక్ష్మీదేవీ, నీటిలో గంగాదేవి ఉంటారట. అందుకే నరక చతుర్దశి నాడు తెల్లవారుఝామునే లేచి నరకుని గడ్డిబొమ్మ దహనం చేసి నువ్వులనూనె ఒంటికి పట్టించి తలంటు స్నానం చేస్తారు. మరణించిన పెద్దలను ఒక్కొక్కరినీ తలచుకుంటూ వారికి సద్గతులు కలగాలని ప్రార్థిస్తూ దీపం పెడతారు. ఆ మర్నాడు దీపావళి. క్షీరాబ్ధి తనయ అయిన శ్రీ మహాలక్ష్మి పుట్టినరోజు. అందుకే ఆ వేళ అందరూ ప్రదోషకాలంలో దీపాలను వెలిగించి లక్ష్మీపూజ చేస్తారు. వ్యాపారులు అమ్మవారిని పూజించి కొత్త దస్త్రాలు మొదలుపెడతారు. నరకాసురుడి వధను తలచుకుంటూ బాణాసంచా కాల్చి, మిఠాయిలతో ఆ ఆనందం పంచుకుంటారు.

తెలంగాణా ప్రాంతంలో బతుకమ్మ పండుగ జరుపుకునేది ఆశ్వీయుజంలోనే. ఈ మాసంలో జరిగే ప్రతి ఉత్సవమూ, పండుగా స్త్రీ ప్రాధాన్యత కలిగినవే. అందుకే ఆశ్వీయుజం మహిళామాసం. పర్వదినాల్లో అమ్మవారిని పూజించి అనుగ్రహం పొందాలి. ఆమె అందించే ఆత్మాశ్రయ సాధనాలనీ, నైపుణ్యాలనూ గ్రహించి సొంతం చేసుకోవాలి.

మానవత్వం-సాయితత్వం

పిలిచిన పలికే దైవంగా భక్తుల మనస్సులో షిర్డీ సాయి నామం సంస్మరణీయం. ఏదైనా ఆలయంలో వందేళ్ళ వేడుక అంటే హోమాలూ, కుంభాభిషేకాలూ, పెద్ద పెద్ద పూజలు నిర్వహించడం సహజం. కానీ బాబా చూపిన మార్గంలోనే నడిచే షిర్డీ సంస్థాన్ వారు షిర్డీ సాయి శతాబ్ది ఉత్సవాలను సేవయే ప్రధానాంశంగా తీసుకుని అత్యంత ఘనంగా నిర్వహించుటకు మూడు వేల కోట్ల రూపాయల బడ్జెట్ ను రూపొందించి 2017 అక్టోబర్ 15 వ తేదీ నుంచి ఒక సంవత్సర కాలం పాటు అనేక సేవా కార్యక్రమములు చేపట్టారు. బలహీన వర్గాల విద్యార్థులకు శిక్షణ, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ఆసుపత్రి, రైతు కుటుంబాలకు స్వయం ఉపాధి, షిర్డీలో నిరంతర

అన్నదాన కార్యక్రమాలు, ఉచిత కంటి చికిత్సలు, రక్తదాన, అవయవదాన శిబిరాలూ, పర్యావరణ పరిరక్షణ, సాయి సచ్చరిత్ర నిత్యపారాయణ, పండితుల ప్రసంగాలు వంటివి షిర్డీలో ఈ ఏడాదంతా ఉంటాయి. మన దేశంతో పాటు ప్రపంచం లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న భక్తుల కోసం స్వయంగా శ్రీ సాయి పాదుకలనే వారి దగ్గరకు తీసుకువెళ్ళే కార్యక్రమాన్ని 2017అక్టోబర్ 12 న గోవాలో ప్రారంభించి, అక్కణ్నుంచి మన దేశంలోని అన్ని జిల్లాలలో పయనిస్తూ, సాయి భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని కలుగజేసింది. సంస్థాన్ వారు చేపట్టిన కార్యక్రమాలు బహు అభినందనీయం.

షిర్డీ సాయినాథుని సుందర విగ్రహం, ఆధ్యాత్మిక ఔన్నత్య శిఖరం. యోగులలో పరమ యోగి, దేవతామూర్తుల్లో సద్గురు సాయి, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, బ్రహ్మజ్ఞాని, జితేంద్రియుడు, మమతామూర్తి, అద్భుత లీలా విలాస మహిమోపేతుడు మనకు అండగా ఉండే దైవం. ఆయన శుద్ధానంద చైతన్యమూర్తి.

షిర్డీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా అలరారుతున్నది. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన హిందూ ఆలయాల్లో మూడో స్థానానికి చేరుకుంది. బాబా మహాసమాధి చెందే నాటికి ఆయన నివాసం ఓ పాడుబడిన మసీదు. మరి ఇప్పుడు.... పిలిచినంతటే పలికే ఆ దైవానికి ఊరూరా ఆలయాలే - వాడవాడలా భక్తులే... 'నా భక్తులు ఎక్కడున్నా పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్టు నా దగ్గరకి రప్పించుకుంటాను' అని చెప్పే సాయినాథుడికి భారత్ లోనే కాదు, ఎన్నో దేశాల్లో ఎందరో భక్తులున్నారు. ఇక సర్వాంతర్యామి అయిన ఆ సద్గురువుకి దాదాపు 50 దేశాల్లో 8,500 దాకా ఆలయాలున్నాయంటే ఆశ్చర్యమేముంది? మహారాష్ట్రతో పాటు తెలుగు రాష్ట్రాలలోనూ, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ లలో బాబా భక్తులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. షిర్డీ ఆలయానికి నిత్యం అరవై వేలమంది భక్తులు వస్తుంటారు. ఇక గురుపూర్ణిమ, శ్రీరామనవమి, నూతన సంవత్సరం లాంటి పర్వదినాల్లో ఈ సంఖ్యా లక్ష వరకూ చేరుతుంది. షిర్డీ సంవత్సర ఆదాయం రు. 410 కోట్లు దాటింది. వీటిలో రు. 260 కోట్లు భక్తుల కానుకలు, విరాళాల రూపంలో వచ్చినవే. సాయి సంస్థాన్ బ్యాంక్ అకౌంట్స్ లో 1800 కోట్ల రూపాయల సొమ్ము, 360 కిలోల బంగారం, సుమారు 4,450 కిలోల వెండి ఉన్నాయట. ఇవి కాకుండా డాలర్లు, పౌండ్ల రూపంలో మరికొంత - ఇలా బాబా ఆలయ ఆస్తుల విలువ 31 మార్చి 2017 నాటికి రెండు వేల కోట్ల రూపాయలకు పైనే.

సదా నింబ వృక్షస్య మూలా-
ధివాసాత్
సుధాస్రావిణం తిక్తమప్య
ప్రియంతం
తరుం కల్ప వృక్షాధికం
సాధయంతం
నమామీశ్వరం సద్గురుం
సాయినాథం

షిర్డీలో సాయిబాబా వేపచెట్టు క్రింద కూర్చుని ధ్యానం చేసుకుంటేనే ఆ వేపచెట్టు ఆకుల్లో చేదు పోయింది. ఆయన్ను మనసులో నిలుపుకుంటే మన కష్టాలు తొలగిపోవడం ఎంతసేపు అని శ్లోకార్థం.

షిర్డీవాసులు బాబాను తొలిసారి చూసింది వేపచెట్టు క్రింద. అప్పటికి ఆయన వయస్సు 16 సం|| లు ఉండవచ్చు. పగలు రేయి, ఎండా వానల్ని లెక్కచేయకుండా ఎప్పుడూ ధ్యానంలోనే మునిగి ఉన్న ఆ బాలుడు ఎవరో, ఎక్కడనుంచి వచ్చాడో వారికి అంతు పట్టలేదు. ఎవరు ఏదడిగినా బాబా బదులు చెప్పేవారు కాదు. అయితే గ్రామస్తులు అదే పనిగా విసిగిస్తుండటంతో కొన్నాళ్ళకు అక్కడనుంచి వెళ్లిపోయారు. కొంతకాలానికి చాంద్ పాటిల్ బావమరిది పెళ్లి కుదిరింది. వధువు షిరిడీ గ్రామం. అలా పెళ్ళివారితో 1858 లో రెండోసారి షిరిడీ

గ్రామంలో అడుగుపెట్టారు బాబా. ఆ మారుమూల పల్లె ఆధ్యాత్మిక శిఖరంలా ఎదిగేందుకు పునాది పడిన రోజది. అచ్చటనే ఉన్న 'ఖండోబా ' దేవాలయం పూజారి 'ఆ సాయీ ఆ ' అని స్వాగతం పలికాడు. 'ఆ' అంటే మరాఠీ భాషలో 'రా' అని అర్థం. 'సాయి' అంటే స్వామీజీ అని అంటారు. అలా పిలిచిన వేళా విశేషమేమో కానీ, గ్రామస్తులందరూ ఆ ఫకీరును 'సాయి ' 'సాయి ' అని పిలవడం మొదలుపెట్టారు. ఆ నామం 'సాయీ' గా మారిపోయింది.

సాయి నడుస్తూ, మాట్లాడుతూ తరుచు 'అల్లా మాలిక్' అంటూ ఉండేవాడు. 'అల్లా' అంటే దేవుడు. 'మాలిక్' అంటే యజమాని. ఆ మాటకు పూర్తి అర్థం జగమునకంతా దేవుడే యజమాని అని భావన. ఇంతకీ ఆయన మహమ్మదీయుడా, హిందువా? ఆయనకు మతాన్ని ఆపాదించడం మొదలుపెట్టారు. ఆయన ఒక పాడుబడ్డ మసీదులో నివాసం ఉంటూ దానికి ద్వారకామాయి అని పేరు పెట్టాడు. లోపల తులసి మొక్కను నాటారు. నిత్యాగ్నిహోత్రాన్ని ఏర్పాటు చేసి, రోజూ మసీదులో దీపాలు వెలిగించడం ప్రారంభించారు. తనకు అన్ని మతాలూ సమానమే అని చాటాడు.

ఆయన మహమ్మదీయులు ధరించే దుస్తులు ధరించేవారు. మహమ్మదీయులు 'చందనోత్సవం' జరుపుకోవడానికి ఒప్పుకునేవారు. 'ఈదుల్ ఫితర్' పండుగనాడు మసీదులో నమాజు చేయించేవారు. హిందువులలాగా చెవికి కుట్టుండేది. గోకులాష్టమి నాడు 'గోపాల్ కాలా' ఉత్సవం జరిపించేవారు. శ్రీరామనవమి ఉత్సవాన్ని నిర్వహించేవారు. బాబా ఉండే మశీదు ఎదుటే 'ధుని' అనే అగ్నిహోత్రాన్ని అఖండంగా వెలిగించి పెట్టారు. మహమ్మదీయ మతానికి వ్యతిరేకమైన తిరుగలి విసరడం, శంఖం ఊదటం, గంటలు వాయించడం, హోమం చేయడం, భజనలు చేయడం, సంతర్పణలు చేయడం, అర్ఘ్యపాద్యాలను ఇవ్వడం తదితరాలను హిందువులా చేసేవారు. ఆయనకు జాతి మతములతో ఎట్టి సంబంధం లేదు. బాబా పండిత స్వాములతోనూ, ఫకీరులతోనూ కలిసిపోయేవారు. హిందువైనా, మహమ్మదీయుడైనా, రాజులైనా, భిక్షకులైనా అందరినీ ఆయన ఒకే రీతిగా ఆదరించేవారు. పశుపక్ష్యాదులు ఆయనకు ఇష్టమైన నేస్తాల్లాగానే ఉండేవి.

షిరిడీలో ఓ ఫకీరుగా అడుగిడిన బాబా, ఒంటరిగా విచ్చేసిన బాబా, తర్వాత కాలంలో లక్షలాది భక్తులకు ఆత్మబంధువయ్యారు. అశేష జన సందోహం అన్ని వేళలా ఆయన చుట్టూ ఉండేది. ఆయనే స్వయంగా మొక్కలు నాటి, పాదులు చేసి, బావినుంచి నీళ్లు తోడుకొని భుజంపై పెట్టుకుని మొక్కలకు నీళ్లు పోసేవారు. ఆయన కృషితో షిరిడీలో ఒక పూల తోట తయారయింది. అంతులేని సంపద వచ్చి పడుతున్నా మరుక్షణం దానధర్మాల పేరిట కరిగిపోయేది. రోజు ముగిసేసరికి బాబా దగ్గర ఏమీ ఉండేది కాదు. ఆపన్నులకు సాయం సాయిమార్గంగా ఉండేది.

షిరిడీలో ఉన్న దేవాలయాలన్నింటినీ మరమ్మత్తులు చేయించారు బాబా. బాబాను ఆశ్రయించిన రోగగ్రస్తులు ఆరోగ్యవంతులయ్యేవారు. దుర్మార్గులు సన్మార్గులుగా మారేవారు. కుష్టువారు రోగవిముక్తులయ్యేవారు. గుడ్డివారికి చూపు వచ్చేది. కుంటివారు నడిచేవారు. సమస్త ప్రాణులు ఒకటేనని, ప్రేమ దయ కారణాలతో మానవ జీవితం సాగాలని, భగవంతునియందు అపార నమ్మకంతో మంచి కర్మలు చేయుటయే పరమావధిగా జీవించాలని, దానగుణం కలిగి ఉండటం, పనిపట్ల శ్రద్ధ వహించటం, బాధ్యతలను మరువకపోవడం ప్రతి మనిషికి పరమ కర్తవ్యమని బాబా గీతాచార్యుడిగా తనదైన 'సాయిగీత '

లా భక్తులకు చెప్పేవారు. తనను విశ్వసించిన వారిని అనునిత్యం కంటిరెప్పలా కాపాడుకుంటానని అభయ హస్తం ఇచ్చేవారు.

షిరిడీ సాయి ఒక చేత్తో రేకు డబ్బా, మరో చేత్తో జోలి పట్టుకుని రోజూ భిక్షాటన చేసి ఆహారం సంపాదించుకునేవారు. ఇళ్లముందు నిలబడి బాబావారు భిక్షువు వలె అక్కా! రొట్టె ముక్క పెట్టు అని పిలిచేవారు. చేయి చాచి తీసుకునేవారు. భిక్షలో దొరికిన పదార్థాలను కుండీ యను మట్టిపాత్రలో వేసేవారు. కుక్కలు, పిల్లులు, కాకులు విచ్చలవిడిగా తింటున్నా తరిమేవారు కాదు. తెచ్చిన పదార్థాలను అందరికీ పంచేవారు.

కులం వల్ల, మతం వల్ల, సంపద వల్ల, పాండిత్య ప్రశస్తి వల్ల, సంప్రాప్తించే గొప్పతనమేదీ లేదని చాటడానికే బాబా తన భక్తులచేత సేవలు అందుకోవాలని ఏనాడూ ప్రయత్నించలేదు. తానే భక్తులకు సేవ చేయడానికి సిద్ధపడేవారు. వారికి స్వయంగానే అవ్యాజమైన ప్రేమతో వండి వడ్డించేవారు. ఒక్కోసారి సాయి తన భక్తుల కాళ్ళు పట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

బాబా నిర్వికార నిరాడంబరుడై నేలపైన నడిచారు. తాను కేవలం దేహ స్వరూపుడు కానని, అఖండ అవ్యయ స్వరూపుడునని ఎరిక ఉన్న మహాత్ముడు. ఆత్మసాక్షాత్కారం పొందాలంటే గురువు ఆవశ్యకత ఉంది. గొప్ప కృషి చేసి, శ్రమించి తపస్సు చేసి ఆత్మసాక్షాత్కారం పొందిన గురువు నుండి సులువుగా పొందవచ్చు. అయితే ముముక్షువు తన చిత్తాన్ని పవిత్రంగా పెట్టుకోవాలి. మనిషి తన విధులను తృప్తిగా, ఫలాపేక్ష లేకుండా నిర్వర్తించాలి. అహంకారం, లోభం, కోరికలు వదిలిపెట్టకపోతే ఆత్మసాక్షాత్కారం కలగదు అని బోధించారు సాయి.

షిరిడీలో దాదాపు 61 సం|| లు నివసించిన బాబా 1918 సం|| లో దసరా రోజున తన భౌతిక కాయాన్ని విడిచి వెళ్లారు. సమాధి చెందడానికి కొన్ని నెలల ముందు, తన భక్తుడు, కోటీశ్వరుడు అయిన బాపూ సాహెబ్ బూటీకి చక్కని భవనం ఒకటి కట్టించమని బాబా చెప్పినట్లు కల వచ్చింది. అది సాయినాథుని ఆజ్ఞగా భావించి పనులు మొదలుపెట్టాడు. బూటీ మందిరం పనులు పూర్తి కావచ్చేసరికి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో బాయిజాబాయి కొడుకు తాత్యా అనారోగ్యంతో మంచం పట్టాడు. చిన్నతనం నుంచీ బాబా 'మామా ' అంటూ ఎన్నో ఏళ్లపాటు ఆయనతో మసీదులో నిద్రించాడు. తాత్యా అనారోగ్యం గురించి తెలుసుకున్న బాబా అతడిని తీసుకురమ్మని కబురు పంపించాడు. అతికష్టం మీద మసీదులో అడుగు పెట్టిన తాత్యాని, 'నీకేం కాదు, నీ బదులు నే వెళ్తాను ' అని చెప్పారట బాబా. బాబా మాటలు అప్పుడు ఎవరికీ అర్థం కాలేదు. కానీ ఆ తర్వాత నుంచీ బాబా ఆరోగ్యం క్షీణించడం, తాత్యా ఆరోగ్యం మెరుగుపడటం మొదలైంది.

విజయదశమి రోజుకి బాబా బాగా నీరసించిపోయారు. చివరికి... ' నాకిక్కడ బాగోలేదు, బూటీ కట్టించిన భవనంలోకి తీసుకువెళ్ళండి ' అని అంటూనే పక్కకు ఒరిగిపోయారు. తర్వాత సద్గురు సాయి చెప్పిన ప్రకారమే ఆయన దేహాన్ని బూటీవాడా లోని మందిరంలో సమాధి చేశారు. అదే ఇప్పటి షిరిడీ ఆలయం. సమాధి పైన ఉన్న బాబా నిలువెత్తు విగ్రహాన్ని ఆ తర్వాత 36 సంవత్సరాలకు ప్రతిష్ఠించారు. ఈ నెలలో రాబోయే విజయదశమికి బాబా సమాధి చెంది వందేళ్లు పూర్తి అవుతుంది. ఈ అపూర్వమైన.. అరుదైన సందర్భాన్ని సాయి భక్తలోకం సాయి శతాబ్ది ఉత్సవాల రూపంలో జరుపుకుంటోంది. షిరిడీ సాయి సంస్థాన్ సైతం సాయి శతాబ్దిని వివిధ కార్యక్రమాల రూపంలో జరుపుకోనుంది.

సాయి శతాబ్ది ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకోసం షిరిడీ రూపురేఖలను మార్చివేస్తున్నారు. భక్తులందరిని తరలి రమ్మంటు-

న్నారు. బాబా తన జీవితకాలంలో భక్తులకు చేసిన బోధనలు ఎన్నో. ప్రేమతత్వం మానవత్వమే సాయితత్వం. బాబా భౌతిక దేహాన్ని విడువక ముందు, తర్వాత కూడా భక్తులను నడిపించిన మార్గం అదే. అందుకే, భక్తులకు బాబా దైవం మాత్రమే కాదు... తల్లీ, తండ్రీ, గురువు, నేస్తం, ఆత్మీయుడు... అన్నీ. ఆ అనుబంధంతోనే కోట్లాది భక్తులు బాబాను గుండెల్లో నిలుపుకుంటున్నారు.

సాయి శరణం బాబా శరణం .....

18-10-2018 న షిరిడీ సాయి సమాధి శతాబ్ది ఉత్సవం.

ముల్లా నస్రుద్దీన్ కథలు

(13 వ పేజీ తరువాయి)

మరి నా గుర్రం గెలిస్తే, నువ్వు నాకు మూడేళ్ళు దాస్యం చేయాలి." అని సవాలు చేశాడు.

"సరే! అయితే! నేను సిద్ధం. తరవాత మాట తప్పిపోకూడదు సుమా!" అని అతన్ని హెచ్చరించాడు నస్రు.

"అది మా ఇంటా వంటా లేదు" అన్నాడు ఆయన ధైర్యంగా, గెలుపు తనదే అని సంబర పడుతూ.

"ఇక చూసుకో నా తడాఖా! నా గుర్రం వెళ్ళిన దారినే నీ గుర్రాన్ని కూడా పరుగు పెట్టించాలి", అంటూ నస్రుద్దీన్ తన గుర్రాన్ని 'చల్!మేరా బేటా!' అని ఎదురుగా ఉన్న ముళ్ళ పొదల గుండా దౌడు తీయించాడు. పాపం ఆ ముసిలి గుర్రం ఒళ్లంతా చీరుకుపోయి రక్తం కార సాగింది. ఆ తరవాత దానిని ఒక కొలనులోకి తోలాడు. అది ఈదలేక ఈదలేక అవస్థ పడుతూ ఎలాగో ఒడ్డుకి చేరుకుంది.

అది చూసిన షావుకారుకి గుండె బేజారెత్తి పోయింది.

'అమ్మో! నా గుర్రానికి అలా ముళ్ళు గుచ్చుకుని ఒళ్ళంతా రక్తం చిందితే.... ? ఇంకేమైనా ఉందా! లక్షలు విలువ చేసే గుర్రం, దమ్మిడీకి కూడా ఎవడూ కొనడు.. అలా నీళ్ళలో మునిగి తడిసిపోతే, జబ్బు చేసి చస్తుందేమో కూడా. అయ్యబాబోయ్! వీడెవడో అఖండుడిలా ఉన్నాడు. వీడితో పెట్టుకుంటే నెత్తికి చేతులే! ఓటమి ఒప్పుకుని పందెం డబ్బు ఇచ్చి ఇక్కడినుంచి చల్లగా జారుకోవడం మంచిది' అని మనసులోనే అనుకుని,

"అయ్యా! నస్రుద్దీన్ గారూ! మీ గుర్రమే గొప్పది. నేను ఓడిపోయానని ఒప్పుకుంటున్నాను. ఇదుగో! ఈ ఏభై బంగారు కాసులు తీసుకుని నన్ను వదిలి పెట్టండి." అని వేడుకున్నాడు.

"అలా రా! దారికి" అని, ఆ డబ్బు సంచి బొడ్లో దోపుకుని నస్రుద్దీన్ ఇంటికి వెళ్ళిపోయాడు.

ఇంతలో విషయం తెలిసి ఆ ముసిలి గుర్రపు యజమాని వచ్చి అతని దగ్గర లబో దిబో మన్నాడు. నస్రు అతనితో,

" భయ్యా! నీ గుర్రానికి వచ్చిన ఆపద ఏమీ లేదు. నా దగ్గర ఏభై బంగారు కాసులు ఉన్నాయి. వాటితో దానికి మంచి తిండి కొనిపెట్టి, వైద్యం చేయిస్తే చిటికెలో మాములుగా అయిపోతుంది. భయపడకు.." అని నచ్చజెప్పి, ఇచ్చిన మాట ప్రకారం గుర్రాన్ని ముందు కంటే బలంగా తయారు చేసి, ఘనంగా తన దోస్తుకి అప్పజెప్పాడు.

ఊరివారంతా నస్రుద్దీన్ తెలివిని మెచ్చుకున్నారు.

జనార్ధన ఠాకూర్

9963933371, 9490189713

అక్టోబర్ 2018 లో మీ రాశి ఫలాలు

అక్టోబర్ నెలలో:
రవి మాసారంభంలో కన్యలో సంచారం, తదుపరి 18వ తేదీన తులారాశిలో ప్రవేశం; కుజుడు మకరంలో సంచారం; బుధుడు మాసారంభంలో కన్య రాశిలో సంచారం తదుపరి తులారాశిలో ప్రవేశం; గురువు మాసారంభంలో తులా రాశిలో తదుపరి 11 వ తేదీన వృశ్చికంలో సంచారం; శుక్రుడు తులలో సంచారం, 6 వ తేదీన వక్ర ప్రారంభం, శని ధనస్సులో సంచారం; రాహువు కర్కాటకంలో; కేతువు మకరంలో సంచారం.

మేష రాశి:
ఈ మాసంలో ఆర్థికస్థితి అనుకూలంగా ఉండును. కృత నిశ్చయంతో కార్యం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో అనుకూలంగా ఉన్నా చిన్న చిన్న అనారోగ్య సమస్యల వలన బాధపడుదురు. ఉద్యోగస్తులకు మంచి సమయం. కొత్త ఆలోచనలు కార్యరూపం దాల్చుట కష్టం. వ్యాపారస్తులకు సామాన్యంగా ఉండును. విద్యార్థులకు శ్రద్ధ అవసరం. న్యాయపరమైన విషయాలలో అనుకూలత తక్కువ. 12 నుండి 14 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) శ్రీరామ రక్షా స్తోత్ర పఠన
2) శ్రీ సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణ ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

వృషభరాశి:
ఈ మాసంలో ఆర్థిక విషయాలలో అతి జాగ్రత్త అవసరం. దీర్ఘకాల వ్యాధులతో బాధ పడేవారు కొంత ఉపశమనం పొందగలరు. వాహనాలు నడుపునప్పుడు అత్యంత జాగ్రత్త అవసరం. ఉద్యోగ విషయంలో ఆకస్మిక సమస్యలు, ఉన్నతాధికారులవలన సమస్యలు కలుగవచ్చును. తీర్థయాత్రలు చేయుదురు. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ అవసరం. 14 నుండి 16 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) శ్రీ కనకధారా స్తోత్ర పారాయణ2) ప్రతి బుధవారం శ్రీ గణపతి ఆలయ సందర్శన ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

మిథున రాశి:
ఈ మాసంలో అధిక ఖర్చులవలన ధన విషయంలో బాధపడు అవకాశము కలదు. ఆరోగ్యవిషయంలో ముందు జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత లోపించును. ఆస్తి వ్యవహారాలలో చిక్కులు, శత్రు భయం ఉండును. ఉద్యోగజీవనంలో ఉన్నవారికి ఆకస్మిక సమస్యలు. వివాహ ప్రయత్నాలు ఫలించును. వ్యాపారము చేయువారు తగిన జాగ్రత్తలు తీసుకొనవలెను. విద్యార్థులకు అనుకూల సమయం. 16 నుండి 19 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) హనుమాన్ చాలీసా పారాయణం2) సూర్య ఆరాధన ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

కర్కాటక రాశి :
ఈమాసంలో ఆర్థిక విషయాలలో, ఆరోగ్య

విషయంలో అనుకూలత ఉండును. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు తగు జాగ్రత్తలు తీసుకోవలెను. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. నిరుద్యోగులు శుభవార్త వింటారు. ప్రయాణాల వలన లాభం. వ్యాపారస్తులకు అనుకూల సమయం. విద్యార్థులకు అనుకూల సమయం. 19 నుండి 21 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) నిత్య దైవారాధన మరియు

2) శ్రీ వేంకటేస్వర స్వామి ఆలయ దర్శనం ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

సింహ రాశి:

ఆర్ధిక పరిస్థితి అనుకూలంగా వున్నా అధిక ఖర్చుల వలన సతమతమవుదురు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. బంధువర్గంతో అభిప్రాయ భేదాలు కలుగవచ్చును. ఉద్యోగస్తులకు అనుకూల సమయం మరియు మంచి గుర్తింపు లభించును. స్థిరాస్థి వ్యవహారం లాభించును. కోర్ట్ వ్యవహారములయందు అనుకూలత. వ్యాపారస్తులకు లాభదాయ కాలం. విద్యార్థులకు అనుకూల సమయం. విజ్ఞులతో స్నేహం వల్ల లాభపడుదురు. 21 నుండి 24 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) కులదేవతారాధన మరియు

2) దుర్గా అమ్మవారి ఆలయ సందర్శన ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

కన్యారాశి:

ఈమాసంలో ఆర్ధిక ప్రణాళిక అవసరం. అనవసరపు ఖర్చులు తగ్గించవలెను. నేత్ర వ్యాధులవలన బాధపడు అవకాశము కలదు. చెడు వ్యక్తులకు దూరముగా ఉండవలెను. మీ అభిలాష నేరవేరుటకు ఆటంకం కలుగును. ఉద్యోగస్తులు, ముఖ్యముగా, ఉన్నత పదవిలో ఉన్నవారు కీలక నిర్ణయాలు తీసుకొనుటలో జాగ్రత్త వహించవలెను. వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉండును. విద్యార్థులకు అనుకూల సమయం. 24 నుండి 26 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సందర్శన మరియు

2)గణపతి ఆరాధన ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

తులా రాశి:

ఆర్ధిక పరిస్థితి అనుకూలంగా ఉండును. ఋణాల చెల్లింపు ప్రయత్నాలు సఫలం అగును. చిరకాల వాంఛ నెరవేరును. ఆరోగ్య విషయంలో ముందు జాగ్రత్త అవసరం. ఉద్యోగస్తులకు చేయు పని యందు జాగ్రత్త అవసరం. వ్యాపారస్తులకు అనుకూల సమయం. 26 నుండి 28 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) ఆంజనేయస్వామికి ఆకుపూజ చేయుట మరియు

2) దత్తాత్రేయ ఆరాధన ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

వృశ్చిక రాశి :

ఆర్ధిక సమస్యలనుంచి బయటపడుటకు చక్కని ఆర్ధిక ప్రణాళిక అవసరం. వాహనము నడుపుటలో జాగ్రత్త అవసరం. ప్రమాదాలు జరిగే అవకాశం కలదు. స్నేహితులు మరియు బంధువర్గముతో జాగ్రత్తగా ఉండవలెను. అపకీర్తి వచ్చు సూచనలు కలవు. ఉద్యోగస్తులకు పదోన్నతి పొందు, గుర్తింపు పొందు అవకాశం కలదు. వ్యాపార లావాదేవీలు అనుకూలముగా ఉండును. విద్యార్థులకు చదువుయందు మిక్కిలి శ్రద్ధ అవసరం. 1 నుండి 3 వ తేదీల మధ్య ముఖ్యమైన

కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) ప్రతిరోజూ శివ స్తోత్ర పారాయణ మరియు
2) శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణ ద్వారా శుభ ఫలితాలు లభించును.

ధను రాశి :

ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉండును. కొన్ని పనులు నెరవేరును. ఆరోగ్యం బాగుండును. దీర్ఘకాల వ్యాధులతో బాధపడువారు కొంత ఉపశమనం పొందగలరు. ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి చూపుదురు. వ్యాపారస్తులకు అత్యంత అనుకూల సమయం. స్థిరాస్తి లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి. విద్యార్థులకు అనుకూలసమయం కాదు. 3 నుండి 5 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) సోమవారం నాడు రుద్రాభిషేకం చేయుట
2) పంచాక్షరీ స్తోత్ర పారాయణ ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

మకర రాశి:

ధన విషయంలో సంతృప్తికరంగా వున్నా కొంత నష్టము జరుగు అవకాశము కలదు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడువారు ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. గృహంలో శుభకార్యం జరుగు అవకాశం కలదు. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. పదోన్నతి పొందు అవకాశం కలదు. వ్యాపారస్తులకు ఆశాజనక కాలం కాదు. కోర్ట్ వ్యవహారములు వాయిదా వేయుట మేలు. 5 నుండి 7 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) దుర్గా సప్తశతి పారాయణ మరియు
2) కనకధారా స్తోత్ర పారాయణ ద్వారా శుభ ఫలితాలు లభించును.

కుంభ రాశి:

ఆర్థిక పరిపుష్టి కలిగి నూతన వస్తువులు పొందు అవకాశము కలదు. ఆవేశం తగ్గించి పనులు చేయవలెను. గృహ వాతావరణం అనుకూలంగా ఉండును. ఆరోగ్య విషయంలో కొంతమేర జాగ్రత్త అవసరం. యోగ మరియు ధ్యానం పై దృష్టి పెట్టవలెను. శ్రమతో కూడిన ప్రయాణము చేయు అవకాశము కలదు. ఉద్యోగస్తులు తమ పై అధికారులతో జాగ్రత్తగా మెలగవలెను. వ్యాపారస్తులు, ముఖ్యంగా రచనా వ్యాసంగం మరియు ముద్రణా రంగంలో ఉన్న వారికి అనుకూల సమయం. 7 నుండి 9 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన మరియు
2) విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ ద్వారా శుభ ఫలితాలు లభించును.

మీన రాశి :

దుబారా ఖర్చులు అదుపు చేసుకున్నచో ఆర్థికముగా అనుకూలముగా ఉండును. పెద్దవారి ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. స్నేహితులు మరియు బంధువర్గం వారితో విరోధం కలుగు సూచనలు కలవు. తీర్థయాత్ర చేయు అవకాశం కలదు. ఉద్యోగ స్థలంలో విరోధము వచ్చు అవకాశం కలదు. వ్యాపారస్తులు కొత్త అవకాశాలు, మరియు లాభాలు పొందుదురు. విద్యార్థులు చదువులో ముందంజలో ఉండెదరు. 9 నుండి 12 వ తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) ఆంజనేయస్వామి ఆరాధన మరియు
2) దుర్గా అష్టోత్తర జపం ద్వారా శుభ ఫలితాలు లభించును.




ఫిజిక్స్ నోబెల్ 2018 గ్రహీతలు ఆర్థర్ ఆష్కిన్,
గెరార్డ్ మౌరూ, డోనా స్ట్రిక్ ల్యాండ్

నోబెల్ బహుమతుల సృష్టికర్త
సర్ అల్ఫ్రెడ్ నోబెల్

కెమిస్ట్రీ నోబెల్ 2018 గ్రహీతలు
ఫ్రాన్సిస్ హెచ్ ఆర్నాల్డ్,జార్జ్ పి స్మిత్, సర్ గ్రెగరీ వింటర్

RNI NO. APTEL/2011/39497 OCTOBER2018 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publishing: 1st October Date of Posting: 8th October

Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001